
WWW.MAHAADAILY.COM
మహా పత్రిక
14-09-2025
ఖమ్మం జిల్లా వార్తలు



# జిల్లాలో 8.02 లక్షల ఓటర్లు



- స్థానికం లో మహిళలే కీలకం
- 1,580 పోలింగ్ కేంద్రాలు సిద్ధం
- గ్రామాల్లో పెరిగిన రాజకీయ వేడి

# సిగ్నల్ కోసం వెయిటింగ్

2025 రెండో సాధారణ మండల, జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికలకు ఖమ్మం జిల్లా సిద్ధమైంది. అధికారులు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఖరారుతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే మిగిలి ఉంది. ఆ ఆదేశాలు వచ్చిన వెంటనే ఎన్నికల బరిలో హెూరాహెూరీ పోరాటం మొదలుకానుంది. జిల్లాలోని 20 మండలాల్లో జడ్పీటీసీ, ఎం.పి.టి.సీ. స్థానాల కోసం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించేందుకు వేదిక సిద్ధమైంది.

ఖమ్మం, మహా

మిగతా 2లో...

### ఓటర్ల శక్తి పెరిగింది.. మహిళలే ఆధిక్యం

ఈసారి ఖమ్మం జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 8,02,690. ఇందులో పురుషులు 3,88,243 ఉండగా, మహిళలు 4,14, 425 మంది నమోదు అయ్యారు. మహిళలు పురుషుల కంటే 26,182 మంది ఎక్కువగా ఉండటం రాబోయే పోరులో కీలక భూమిక పోషించనుంది. కూసుమంచి, ముదిగొండ, నెలకొండపల్లి, తిరుమలాయ పాలెం మండలాల్లో మహిళా ఓటర్ల అధిక్యం స్థానిక నాయకులను కొత్త లెక్కలలో పడేసింది. మహిళలకు నచ్చే అభ్యర్థులే గెలుపు దిశగా పయనించే అవకాశమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### తిరుమలాయపాలెం అగ్రస్థానం

మండలాల వారీగా చూస్తే తిరుమలాయపాలెం మండలంలో 50,771 ఓటర్లు నమోదు కాగా, ఎన్కూరు మండలంలో కేవలం 27,920 మంది మాత్రమే ఉండటం ప్రత్యేకత. వైరా మండలంలో కూడా ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో అక్కడ పోటీ తీవ్రంగా, సమీకరణాలు స్పష్టంగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు కూసుమంచి, నెలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో అధిక ఓటర్లు ఉండటంతో అభ్యర్థుల ఎంపికలోనే కసరత్తు మొదలైంది.



## మణుగూరులో భారీ వర్షం

మణుగూరు, మహా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు వచ్చిన గాలులు, మబ్బులు పట్టణమంతా చీకటి కమ్ముకున్న వాతావరణాన్ని సృష్టించాయి. భారీ వర్షం కారణంగా పట్టణంలోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి. కట్టువాగు, కోడిపుంజుల వాగులు ఉధృతంగా ప్రవహించాయి. సురక్ష బస్టాండ్ సముద్రం దగ్గర ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అరగంటపాటు కురిసిన వర్షంతో రహదారులు చెరువుల్లా మారాయి. వాహనాలు ఇరుక్కుపోయి నిలిచిపోవడంతో సురక్ష బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. పాదాచారులు వరద నీటిలో ముందుకు సాగాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం వరకు వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ సవ్యంగా నడవక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.



## డైలీ వేజ్ వర్కర్ల సమ్మెకు టియుసిఐ మద్దతు

జూలూరుపాడు, సెప్టెంబర్ 13, (మహా): మండల పరిధి నర్సాపురం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్లు శుక్రవారం చేపట్టిన నిరవధిక సమ్మెకు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) భద్రాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దులాపురం గోపాలరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కనీస వేతనాల సర్క్యులర్ (గెజిట్) పాత పద్ధతి ప్రకారమే వర్కర్ల కు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మికుల పొట్ట కొడుతున్న జీవో 64 ను నిలిపివేయాలని కోరారు. ఐదు సంవత్సరాల పైబడి సర్వీసున్న హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ల అందరిని పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, కార్మికులకు కూడా యూనిఫాం, ఐడి కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా తదితర బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ పూర్వ అధ్యక్షుడు మంగిలాల్, బాణోత్ రాజు, కల్లి లక్ష్మి గుమ్మడి రాజేశ్వరి, బాణోత్ తులసి, సోలం వెంకటమ్మ, భుక్య శాంత, చంద్రు, రాధ, ఈసాల లక్ష్మి, జోగ ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడులకు నిరసన



మణుగూరు, మహా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో శనివారం జర్నలిస్టులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో ఓ జర్నలిస్టుపై అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈ ర్యాలీ చేపట్టారు. జర్నలిస్టుల నాయకత్వంలో మణుగూరు ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ సాగి స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ముగిసింది. అనంతరం జర్నలిస్టుల ప్రతినిధులు ఎస్ ఐ రంజిత్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పిండిగ వెంకట్ మాట్లాడారు. ఖమ్మంలోని జర్నలిస్టుపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం పోరాడే జర్నలిస్టులపై అక్రమ కేసులు మోపడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని జర్నలిస్టు సంఘ నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం శ్రీనివాస్, షాబీర్ పాషా, చందు, కృష్ణమోహన్, కిషోర్, నరేష్, శ్రీహరి, ఓదెలు, రాబిన్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదవాడికి అభివృద్ధి: ఎమ్మెల్యే రాగమయి

### ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



కల్లూరు,మహా: కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని రైతు వేదికలో 90 మంది లబ్ధిదారులకు 28,82,500 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, 22 మంది లబ్ధిదారులకు 22,02,552 రూపాయల కళ్యాణ లక్ష్మి చెక్కులు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పేదవాడి అభివృద్ధికి దోహదపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మిస్తున్నారని,గూడులేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు,కూడులేని పేదవాడికి సన్న బియ్యంతో అన్నం, కూతురికి పెళ్లి చేయలేని తల్లిదండ్రులకు కళ్యాణ లక్ష్మి సహాయం,అనారోగ్య పరిస్థితులలో వైద్యం చేయించుకోలేని కుటుంబాలకు ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నేరుగా లబ్ధిదారులకు సహాయం,ప్రతి ఇంటికి ఉచిత కరెంటు,దూర ప్రాంతాలలో విధులు నిర్వహిస్తూ వారి సంపాదన రవాణాకు ఖర్చు కాకుండా ఉచిత బస్సు ప్రయాణం,పేద విద్యార్థులు విద్యను అభ్యసించడానికి అనవుగా హాస్టల్ వసతులు వాటిపై పర్యవేక్షణ వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం లోనే పేదలకు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే అన్నారు. సామాన్యుడి జీవిత ప్రయాణంలో ప్రతి పథకం ఉపయోగపడేలా రూపొందించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికలలో ఓటు ద్వారా తమ పూర్తి మద్దతు తెలపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో,ఎంపీడీవో, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతాంగాన్ని రోడ్డున పడేసిన కాంగ్రెస్

### బిజెపి జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి



ఖమ్మం, మహా: రాష్ట్రంలోని యూరియా సంక్షోభానికి ముమ్మాటికీ రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారే కారణమని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలనతోనే పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు రోడ్ల వెంట బారులు తీరుతున్నారని విరుచుకుపడ్డారు. ఆధార్, పాసుబుక్‌లు చేతబట్టుకొని ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌ల ఎదుట పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం నాడు ఖమ్మం జిల్లాలో వారు విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి తతో కలిసి తిరుమలాయపాలెం మండలం సుబ్బలేడు గ్రామ పరిధిలోని రైతులతో ముచ్చటించారు. పొంగులేటి సుధాకర్ రెడ్డి తో స్థానిక రైతులు వారి గోసను వెల్లడించారు. యూరియా కోసం వారు పడుతున్న ఇబ్బందులను పొంగులేటికి వివరించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ 'పండుగ లేదు.. పబ్బంలేదు.. ఎండలేదు..వాన లేదు.. రాత్రింబవళ్లు క్యూలలో నిలబడుతున్నరు. తిండీతిప్పలు లేకపోవడంతో అలసి సొలసి పడిపోతున్నరు. నిలబడే ఓపిక లేక లైన్‌లో చెప్పులు, రాళ్లు, అట్టపెట్టెలు, ఖాళీ సీసాలు పెట్టి నిరీక్షిస్తున్నరు' అంటూ విచారం వ్యక్తంచేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అవసరమైన యూరియా ను సరఫరా చేసిన యూరియాను దారి మళ్లించి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు వేస్తున్నారని దుయ్యబట్టారు. అంతే కాకుండా రాష్ట్రానికి వచ్చిన యూరియా సరఫరాపై ప్రభుత్వానికి ప్రణాళిక లేకపోవడంతోనే దేశానికి అన్నంపెట్టే అన్నదాతకు ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు.'పత్తి పూత దశలో ఉన్నది.. వరి పొట్ట దశలో ఉన్నది. ఈ సమయంలో యూరియా వేయకుంటే దిగుబడి రాదు. పెట్టుబడి దండుగ' అంటూ ఆవేదనతో రైతులు చెప్తున్న మాటలు వింటుంటే గుండె తరుక్కుపోతున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు నెలలుగా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నా పాలకులు మొద్దునిద్ర నటించడం దారుణమని దుయ్యబట్టారు. 22 నెలల్లో యావత్ తెలంగాణ రైతాంగాన్ని నడిరోడ్డు మీదకు ఈడ్చిన ఘనత కాంగ్రెస్ పాలనకే దక్కిందని ఎద్దేవా చేశారు. హస్తం పార్టీ దిక్కుమాలిన పాలన రాష్ట్ర రైతాంగానికి పెనుశాపంగా మారిందని మండిపడ్డారు. దేశ చరిత్రలో ఏనాడు యూరియా కోసం ఇంత తిప్పలుపడ్డ పరిస్థితులు చూడలేదని చెప్పారు. అంతేకాకుండా సందర్భంగా ఫసల్ బీమా తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి మహిళా రైతులకు పొంగులేటి సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఇక రైతు శ్రేయస్సు కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన గురించి మహిళా రైతులకు వివరించారు. స్వల్ప ప్రీమియం చెల్లిస్తే మిగతా భారం కేంద్రం భరిస్తుందని, పంట నష్టపోతే రైతు బ్యాంకు ఖాతాలో నేరుగా నష్టపరిహారం జమ అవుతుందని చెప్పారు. ధాన్యం, వరి, మొక్కజొన్న, గోధుమ, పప్పుధాన్యాలు, పత్తి, వేరుశనగల వంటి పంటలకు ఈ బీమా వర్తిస్తుందని వివరించారు.సహజ విపత్తులు, కరువు, అధిక వర్షాలు, వడగండ్ల వాన కారణంగా పంట నష్టపోతే రైతుకి ఈ పథకం రక్షణ కవచంలా నిలుస్తుందని చెప్పారు. రైతు అప్పుల్లో మునిగిపోకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోవడానికి ఇది తోడ్పడుతుందని భరోసా ఇచ్చారు.తెలంగాణ విమోచన దినోత్సవ సందర్భంగా నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా తన కలంతో గలమై గర్జించిన ప్రముఖ రచయిత షోయబుల్లాఖాన్ గారి విగ్రహానికి పూలమాలతో నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు , పాలేరు అసెంబ్లీ కాంటెస్ట్ అభ్యర్థి నన్నా రవికుమార్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంగల సత్యనారాయణ , రాష్ట్ర నాయకులు జి వెంకటేశ్వర్లు, మందడపు సుబ్బారావు ,దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మందడపు ప్రభాకర్ రెడ్డి , గుత్తా వెంకటేశ్వర్లు, సుదర్శన్ మిశ్రా, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, రవి రాథోడ్ , విజయ రెడ్డి, రజినీ రెడ్డి , నెల్లూరి బెనర్జీ, నగరికంటే వీరభద్రం మండల కన్వీనర్ ఇందూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొండికుంటలో మొదలైన బొడ్డెమ్మ పండగ సందడి



అశ్వాపురం. మహా: మొండికుంట గ్రామంలో తుమ్మలచెరువు రోడ్ కమ్యూనిటీ మహిళామణుల ఆధ్వర్యంలో ఘనంగా బొడ్డెమ్మ పండగ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. బొడ్డెమ్మను పుట్ట మట్టితో అందంగా పేర్చి చెక్క పీటపై కలశం పెట్టి పసుపు గౌరమ్మను ఉంచుతారు. ఇలా రోజు ఈ కమ్యూనిటీలో చాగంటి వారి ఇంటి ముందు అలికి ముగ్గులు పెట్టి ఆటపాటలతో బొడ్డెమ్మను అమావాస్య వరకు ఆడుతా%శీ% అని తెలిపారు. ఇక బొడ్డెమ్మ వేడుకలు పూర్తవ్వగానే నెక్స్ డే అమావాస్య రోజున మహిళలకు ఇష్టమైన బతుకమ్మ పండుగ వేడుకలు స్టార్ట్ అవుతాయి. బతుకమ్మకు తొమ్మిది రోజులు ఆడవాళ్లంతా సెలబ్రేట్ చేసుకుంటారు. చివర రోజు అయితే మహిళలు పట్టు చీరలు, నగలు ధరించి అట్రాక్షన్‌గా నిలుస్తారు. బొడ్డెమ్మ నుంచి బతుకమ్మ వరకు 20 రోజులు మొత్తం పండుగ వాతావరణం ఉట్టిపడుతుంది.




# ప్రజలకు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

**టేకులపల్లి - మహా:** వైద్యరంగంలో ఉన్న ఖాళీగా ఉన్న ఉద్యోగాలు వెంటనే భర్తీ చేసి, వైద్య సమస్యలు పరిష్కారం చేయాలనీ కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం లోని సులానగర్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్సీ ముందు ప్రగతిశీల యువజన సంఘం( పి వై ఎల్ ) మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించి, వైద్య అధికారికి వినతిపత్రం అందజేశారు ఈ ఆందోళన కార్యక్రమం కి ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో వేలాది గా డాక్టర్, నర్స్, ఏఎన్ఎం, ల్యాబ్ అసిస్టెంట్ ఖాళీగా ఉన్నాయి అని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలం అయింది అని, ఏజెన్సీ ప్రాంతం లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాల తో బాధపడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గ్రామీణ ప్రాంతాలలో మెడికల్ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలనీ, అదేవిధంగా ప్రైవేటు ఆసుపత్రి ల దోపిడీ ని అరికట్టాలని, వైద్య రంగంలో ఉన్న ఖాళీ లు భర్తీ చేయాలనీ, వెంటనే వైద్యరంగ సమస్య లు పరిష్కారం చేయాలనీ, లేకుంటే ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా వైద్య అధికారిని, వైద్య శాఖ మంత్రి ని కలసి సమస్యలను తెలియ చేస్తాం అని అన్నారు . ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు తోటకూరి. సతీష్, కొడెం. రవి, భూక్య. లక్ష్మణ్, పూనెం.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.





# సిగ్నల్ కోసం వెయిటింగ్

**మొదటిపేజీ తరువాయి**

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు బయటపడగానే గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎవరు ఎం.పి.టి.సీ., ఎవరు జడ్‌పీటీసీ బరిలోకి దిగుతారో అనే చర్చలు మొదలయ్యాయి. ప్రతి పార్టీ తన బలహీనతలు, బలాలను లెక్కగట్టి వ్యూహ రచనలో నిమగ్నమైంది. ముఖ్యంగా మహిళా ఓటర్ల ఆధిక్యం కారణంగా అభ్యర్థుల ఎంపికలో కొత్త సమీకరణాలు తప్పవని స్థానిక నేతలు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 283 ఎంపీటీసీ స్థానాల కోసం అధికారులు 1,580 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. బోనకల్‌లో 67, చింతకానిలో 86, ఎన్కూరులో 55, తిరుమలాయపాలెంలో 100 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాల కోసం ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

### ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్ కోసం వెయిటింగ్...

ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నప్పటికీ, ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే మిగిలి ఉంది. ఒకసారి ఆ ఆదేశాలు వెలువడగానే నోటిఫికేషన్ జారీ అవుతుంది. వెంటనే అభ్యర్థుల నామినేషన్లు, పరిశీలనలు, ఉపసంహరణలతో ఎన్నికల ప్రక్రియ వేగం అందుకోనుంది. అధికారులు ప్రజాస్వామ్య మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు.

### ప్రజాస్వామ్య వేదిక సిద్ధం...

బోనకల్ నుంచి ఎర్రుపాలెం వరకు ప్రతి గ్రామం ఎన్నికల రంగంలోకి అడుగుపెడుతోంది. ఓటర్ల సమీకరణలు, అభ్యర్థుల లెక్కలు, రాజకీయ చర్చలు మొదలవ్వడంతో గ్రామాల వాతావరణం ఉత్సాహంగా మారింది. ప్రజాస్వామ్య శక్తిని ప్రతిబింబించే ఈ ఎన్నికలు జిల్లాలో రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. మొత్తంగా, ఖమ్మం జిల్లా ఎన్నికల హోరాహోరీకి రంగం సిద్ధమైంది. అధికారులు బరిసిద్ధం చేశారు.. ఇప్పుడు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే మిగిలి ఉంది.



# డైలీ వేజ్ వర్కర్ల సమ్మెకు మద్దతు

**టేకులపల్లి - మహా :** టేకులపల్లి మండలంలో డైలీ వేజ్ వర్కర్ల సమ్మెకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు డి అరుణ్ పాల్గొని మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ హాస్టల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లకి 10 నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని గతంలో ఇచ్చిన జీతాలను పాత పద్ధతిలో అమలు చేయాలని వర్కర్ల కుటుంబంలో మరణించిన వారికి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పర్మినెంట్ చేయాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని వర్కర్లకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో లోకేష్. సంతోష్. అరుణ్. తిలక్. భరత్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

# దోమ తెరలు పంపిణీ



**అశ్వాపురం.మహా:** అశ్వాపురంమండల పరిది లోని మల్లెలమడుగు గ్రామపంచాయతీ వలస ఆదివాసీలు నివాసం ఉండే చింతకుంట గ్రామస్తులకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో అశ్వాపురం సిఐ అశోక్ రెడ్డి దోమతెరలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయం

**టేకులపల్లి - మహా :** టేకులపల్లి మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు నైజాం నిరంకుశ పాలన అంతం కోసం సాగిన స్ఫూర్తిగా వారోత్సవాల్లో భాగంగా ముందుగా అరుణ పథకాన్ని ఎగరవేశారు. తెలంగాణ అమరవీరులకు నివాళుర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఐ జిల్లా నాయకులు గుగులోతు రామ్ చందర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతంగా పోరాట వారోత్సవాలు సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుచున్నయని అందులో భాగంగానే టేకులపల్లి మండలంలో జరుపుతూ భారతదేశ చరిత్రలో అపూర్వమైన అధ్యాయం పేద రైతుల భూధాన్య నిర్మూలన జమీందారీ వ్యవస్థ కూల్చివేత కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన పోరాటయోధుల త్యాగాన్ని శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఆ కాలంలో 1946. 1951 అనేది నిజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన పోరాటంలో నాలుగున్నర వేల మంది తెలంగాణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ పోరాటం ప్రధానంగా హైదరాబాద్ సంస్థానంలోని భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం. భూ పంపిణీ. వ్యవసాయ సంస్కరణల లక్ష్యంగా సాగింది. భూమిలేని వారికి భూమిని పంపిణీ చేయడం. ప్రజలను దోపిడి నుండి రక్షించడం. ప్రాముఖ్యత ఈ పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో నిజాం పాలనను సవాలు చేసింది. రైతులు కూలీలు గిరిజనులు తుపాకీలు పట్టుకొని జమీందారులు దోపిడిని ఎదిరించారని తెలిపారు ఈ పోరాటం వల్లే గణనీయమైన సామాజిక మార్పులు చోటు చేసుకున్నయని వివరించారు. రావి నారాయణరెడ్డి. బద్దం ఎల్లారెడ్డి. బొమ్మ గాని ధర్మభిక్షం. చాకలి ఐలమ్మ. మొహిద్దిన్ వంటి మహనీయ సాయుధ పోరాట ఫలితంగా తెలంగాణ ప్రజలకు. అన్ని వర్గాల వారు ప్రాణ త్యాగాలు చేశారని. కమ్యూనిస్టులు చేసిన విరోచిత పోరాటాలను తట్టుకోలేకనే నైజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సుదినం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అయిత శ్రీరాములు రవీందర్ లక్ష్మణ్ బాలు సత్యం రాములు కృష్ణ యువరాజు సోనీ బుజ్జి శారద కమల సంధ్య రాంబాయి తదితరులు పాల్గొన్నారు



# జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 13 (మహా):** కొత్తగూడెం జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుండి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 11 బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసారి జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన లభించిందని చెప్పారు. రాజీమార్గంలో కేసుల పరిష్కారంకోసం కక్షిదారులు పెద్దఎత్తున ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇందుకు న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు యంత్రాంగం చేసిన కృషిని కొనియాడారు. వైవాహిక వివాదాన్ని సామరస్యంతో పరిష్కరించుకొని ఒక్కటైన దంపతులకు అవార్డు అందజేసి అభినందించారు. రాజీమార్గమే రాజమార్గమని, చిన్న తగాదాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుని స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని కక్షిదారులకు సూచించారు. కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశం కల్పిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారమై అవార్డు పాస్ చేస్తే అది అంతిమ తీర్పు అవుతుందన్నారు. కక్షిదారులకు పులిహోర, మంచినీటి సదుపాయాన్ని ఎస్బిఐ వారి సౌజన్యంతో కల్పించారు. ఈ కార్యక్రమంలో మెజిస్ట్రేట్లు కె. సాయి శ్రీ, బి. రవికుమార్, వి.వినయ్ కుమార్, స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు , పి. పివిడి లక్ష్మి, బార్ ఆసోసియేషన్ ఉపాధ్యక్షుడు జే .గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి బాగం మాధవరావు, చీఫ్ డిఫెన్స్ లిగలు ఎయిడ్ కౌన్సిల్ వి. పురుషోత్తం రావు, డిప్యూటీ లీగల్‌ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, సీనియర్-జూనియర్ న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, పోలీసు అధికారులు, జిల్లా కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి..



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 13 మహా :** కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి అంటే సాదా బైనామా క్రమబద్ధీకరణ సాక్ష్యమని పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...గత ప్రభుత్వం సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం తెరపైకి తీసుకొచ్చిందని అన్నారు. కానీ ఆర్వోఆర్ చట్టం 2020 లో చిత్తశుద్ధి లోపించి న్యాయపరమైన వివాదాలతో మధ్యలోనే నిలిచిపోయిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాటకు కట్టుబడి సాదాబైనామా క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు ఇంకా పూర్తి కాకముందే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం నిబద్ధతను నిరూపిం చుకుం టుందన్నారు. సాదాబైనామాల క్రమబద్ధీకరణ కై కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్వోఆర్- 2025 భూభారతి చట్టం ను తీసుకొచ్చిందని అన్నారు. సెక్షన్ -6 సబ్ సెక్షన్-1 ద్వారా దరఖాస్తులు క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. ఈ చట్టం వలన సన్న, చిన్న కారు రైతులకు ప్రయోజనం చేకూరునుందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లకు సన్న, చిన్న కారు రైతుల తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ చట్టం ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా మణుగూరు కోర్టులో నేషనల్ లోక్ అదాలత్



**మణుగూరు మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. వివిధ రకాలుగా పెండింగ్‌లో ఉన్న పలు కేసులు ఈ సందర్భంగా పరిష్కారం పొందాయి. రాజీకి వచ్చిన కక్షిదారులకు మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి లోక్ అదాలత్ అవార్డు ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ.. న్యాయపరమైన వివాదాలను సులభ మార్గంలో, తక్కువ ఖర్చుతో ముగించుకోవడానికి లోక్ అదాలత్ వేదిక ఎంతో దోహదం చేస్తుందన్నారు. కోర్టులలో సంవత్సరాల తరబడి కొనసాగుతున్న కేసులు ఇలాంటి వేదికల ద్వారా త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. ప్రజలు న్యాయాన్ని సులభంగా పొందేందుకు ఈ విధానం ఉపయోగపడుతోందని, రాజీ ద్వారానే శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. అనంతరం వివిధ చట్టాలను వివరిస్తూ రాజీయే రాజమార్గమని, క్షణికావేశంలో చేసే తప్పులను కాలయాపన చేయకుండా రాజీ చేసుకుని ప్రశాంత జీవితాన్ని పొందాలని ఆకాంక్షించారు. జరిగిన లోక్ అదాలత్ లో పోలీస్, కేసులు, చెక్ బౌన్స్, డివిసి, ఎంసి కేసు కలిపి 35, వీటితోపాటు 59 పెట్టి కేసులలో నేరం అంగీకరించినందున కోర్టు జరిమానా విధించి కేసులు కొట్టివేసింది. కాగా ఈ కేసులలో జరిమానా మొత్తంగా 3,10, 900లు జరిమానా విధించారు. అదేవిధంగా ఎక్సైజ్ కు చెందిన 10 కేసులలో ముద్దాయిలు మొత్తంగా 50 వేల రూపాయలు జరిమానా చెల్లించారు. అదేవిధంగా బ్యాంకులో, బిఎస్ఎన్ఎల్, సైబర్ బకాయిలకు చెందిన సమస్యలలో ఫ్రీ లిటిగేషన్ కేసు కింద లోకాదళతులో కేసులకు సంబంధించి 69 లక్షల 31 వేల 413 రూపాయలను అంగీకరించిన మొత్తంగా చెల్లించి సమస్యను పరిష్కరించుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లావణ్య, డీఎస్పీ రవీందర్ రెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంకం. సర్వేశ్వరరావు, లోక్ అదాలత్ మెంబర్ కె వీర మధుసూదన్, లీగల్ ఎయిడ్ మెంబర్ పోశం భాస్కర్, న్యాయవాదులు , మణుగూరు సి ఐ నాగబాబు, ఏడూళ్ళ బయ్యారం సి ఐ వెంకటేశ్వర్లు, బ్యాంకు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కక్షిదార్లు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం




**ఖమ్మం,మహా:** రాజీ మార్గమే రాజా మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, లోక్ అదాలత్ లో రాజీతో ఇరువర్గాలు గెలిచినట్లేనని, లోక్ అదాలత్ తీర్పు, సుప్రీంకోర్ట్ తుది తీర్పుతో సమానమని అన్నారు. లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్ లు ఉపయోగ పడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృధా అవుతుందని, కేసుల పరిష్కారంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కేసుల సత్వర పరిష్కారంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. కుటుంబ వివాదాల కేసులలో ముఖ్యమైనవి భార్యాభర్తల కేసుల వివాదాలలో ఇద్దరు కలిసి ఉంటే, వారి సంతానంతో పాటు ఇరువర్గాల కుటుంబాలు కూడా సుఖ సంతోషాలతో ఉండి, ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలో 4746 కేసులను గుర్తించి, ఇప్పటికే 502 కేసులు పరిష్కరించగా, గత లోక్ అదాలత్ లో 19849 కేసులను పరిష్కరించినట్లు ప్రధాన నాయమూర్తి తెలిపారు. ప్రస్తుత లోక్ అదాలత్ లో 597 కేసుల పరిష్కారం అవనున్నట్లు అన్నారు. భాగస్వాములందరూ లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసుల పరిష్కారంతో కక్షిదారుల మధ్య సుహృద్భావ వాతావరణం తో పాటు, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ లో ఒకరు గెలవడం, ఒకరు ఓడడం ఉండదని, ఇద్దరు విజేతలేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, భవిష్యత్తులో న్యాయ సేవాధికార సంస్థ సేవలు జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో తీసుకెళ్లడానికి బార్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు దేవినేని రాంప్రసాదరావు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర రావు, ఎం. కల్పన, టి. మురళీమోహన్, కాసరగడ్డ దీప, బెక్కం రజని, ఏపూరి బిందు ప్రియ, వినుకొండ మాధవి, బి. నాగలక్ష్మి, అఖిల, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, మీడియేటర్స్, న్యాయవాదులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## టాప్ న్యూస్



### రెండేళ్ల తర్వాత మణిపూర్ గుర్తొచ్చిందా
- ప్రధాని మోదీ పర్యటనపై ఎంపీ ప్రియాంక గాంధీ కౌంటర్

02



### అనిత యాంకరా? లేక హోం మంత్రా?
- మాజీ మంత్రి రోజా ఫైర్
- మెడికల్ కాలేజీలు చూపిస్తా.. వస్తావా? అంటూ సవాల్

02



### కవిత కుటుంబంతో కలవడం ఖాయం
- బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పార్టీ మారకుంటే.. కేటీఆర్ మీటింగ్ కు పోవాలి
- బీజేపీ ఎంపీ డీకే అరుణ

02



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

### అమరావతి.. తిరుగులేని పురోగతి

ఏపీ సీఎం చంద్రబాబు అమరావతిని నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారు. అమరావతిలో ఇప్పుడు యాభై వేల కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయి. ప్రైవేటు పెట్టుబడులు కూడా కలిస్తే.. వచ్చే మూడేళ్ళలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో నిర్మాణం జరుగుతుంది. ప్రస్తుతం అమరావతి స్థిరపడుతుందన్న భావన సర్వత్రా వ్యాపించిన వేళ వైసీపీ కూడా తాము భవిష్యత్ లో గెలిస్తే అమరావతి రాజధానిగానే పరిపాలన ఉంటుందని స్పష్టత ఉంటుంది. తద్వారా రాజధాని చర్చకు సంపూర్ణంగా తెరదించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ అమరావతి మధ్య హైవే, రైలు మార్గాలకు సంబంధించి ప్రతిపాదనలు తయారుచేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ఏపీలోని వైసీపీ అమరావతి రూటులోకి వచ్చింది. అమరావతిపై గతంలో కమ్ముకున్న అనుమానపు మేఘాలు తొలిగి.. అద్భుత నగరం ఆవిష్కృతం అవుతుందన్న విశ్వాసం జనబాహుళ్యంలో పెరిగింది.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో


ANN తెలుగు

Follow: @ANNTELUGU

14-09-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 281 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




# నీటి వాటా పోరు

## కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా

904 టీఎంసీల కోసం పట్టుబట్టండి

ఒక్క చుక్క కూడా వదులుకోం

ట్రిబ్యునల్ విచారణ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష

ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో తెలంగాణ తుది వాదనలు

బీఆర్ఎస్ హయాంలో తీవ్ర అన్యాయం..

512 టీఎంసీలకు ఒప్పుకోవడం వల్లే సమస్యలు

**హైదరాబాద్, మహా:** కృష్ణా నదిలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీరు కుడా వదులుకునేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను సాధించుకునేందుకు పట్టుబట్టాలన్నారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో


SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,11,170 |
| 22 క్యారెట్ | 1,01,900 |
| సిల్వర్ (కేజీ) | 1,30,000 |


### స్థాయిని మించి మాట్లాడుతున్న కేటీఆర్
- రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతికత కేటీఆర్ కు లేదు
- సీబీఐ విచారణ నుంచి బయట పడాలని కేటీఆర్ ప్లాన్
- టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధ్వజం



**హైదరాబాద్, మహా :** మాజీ మంత్రి కేటీఆర్ తన స్థాయిని మించి మాట్లాడుతున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేష్

మిగతా 2లో




## సీఎం రేవంత్‌ను కలిసిన కంది

ఆదిలాబాద్ సమస్యలపై సీఎంకు వినతులు.. ఆదిలాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, మహా: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి శనివారం మధ్యాహ్నం భేటీ అయ్యారు. జూబ్లిహిల్స్ లోని సీఎం నివాసంలో కలిసిన కంది శ్రీనివాసరెడ్డి ఆదిలాబాద్ నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్ళారు. ఆదిలాబాద్ అభివృద్ధిపై తనకు ప్రత్యేక విజన్ ఉందని, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యపరంగా అన్నిరంగాల్లో ఆదిలాబాద్ ను ముందుకు తీసుకెళ్ళే విజన్ డాక్యుమెంట్ త్వరలో ప్రకటిస్తామని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. స్థానిక ఎన్నికల్లో మంచి విజయాలు సాధించాలని, ఆదిలాబాద్ జిల్లా పరిషత్ గెలవాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కందిని ఆదేశించారు. సిసిఐతో పాటు స్థానిక అంశాలపై వినతులు సమర్పించగా, సానుకూలంగా స్పందించారు. త్వరలో తాను ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వస్తానని సీఎం చెప్పారు.

### అవినీతి నిర్మూలనకు ఏఐ మంత్రి

అల్బేనియా ప్రధాని సంచలన ప్రకటన



02

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే గెలుపు


## ఎఎన్ఎన్-మహా సర్వేలో మెజారిటీ జనాభిప్రాయం

## కాంగ్రెస్- బీఆర్ఎస్ మధ్యే బిగ్ ఫైట్

**కాంగ్రెస్ గెలుస్తుంది- 59శాతం.. బీఆర్ఎస్ - 32శాతం**

**పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకోవాలంటున్న పబ్లిక్**

**హైదరాబాద్, మహా:** జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందని మెజారిటీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. శనివారం ఎఎన్ఎన్ ఛానల్ జూబ్లిహిల్స్ బైపోల్ పై ఒపీనియన్ పోల్ నిర్వహించగా, 22వేల మంది ఇందులో పాల్గొన్నారు. ఎఎన్ఎన్ మహా సర్వేలో తమ అభిప్రాయాన్ని చెప్పారు. 59శాతం మంది కాంగ్రెస్ పార్టీనే ఈ నియోజకవర్గం కైవసం చేసుకుంటుందని అభిప్రాయపడ్డారు. 32శాతం మంది బీఆర్ఎస్ గెలుస్తుందని చెప్పారు. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇక పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలా అన్న ప్రశ్నకు 70శాతం మంది చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడాలని కోరుకుంటున్నారు. 16 శాతం మంది వద్దని , 11 శాతం మంది వేచిచూడాలని చెప్పారు. ఇక తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ ఉందని, తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఉందని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు.





## పార్టీ మారింది.. అభివృద్ధి కోసమా?
# నీ సొంత అభివృద్ధి కోసమా?

- పార్టీలోనే కొనసాగుతుంటే బీఆర్ఎస్ మీటింగ్‌లో ఎక్కడ
- పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయక తప్పదు
- గద్వాలలో జోష్ చూస్తుంటే ఉప ఎన్నికలో గులాబీ జెండా ఎగరడం ఖాయం
- గద్వాల బహిరంగ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

**గద్వాల, మహా:** వచ్చే ఆరు నుంచి 9 నెలల్లో ఇదే గద్వాలలో తిరిగి ఉప ఎన్నిక వస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గద్వాలలో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. నేను కాంగ్రెస్‌లో ఎందుకు చేరతానని కృష్ణమోహన్ రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో గద్వాల ప్రచారానికి వచ్చినప్పుడు, వైఎస్ఆర్ చౌరస్తాలో

మిగతా 2లో



Gold Jewellery
3%
V.A ONWARDS

manepally
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890

Diamonds
₹49,950/-
Onwards
E-F / VVS



General Bazar 9912010888 | Punjagutta 7893800555 | Kukatpally 8897387888 | Dilsukhnagar 6309111699 | Chandanagar 8712690020 | Suchitra Circle 8712690030

# నీటి వాటా పోరు



(మొదటిపేజీ తరువాయి)

ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సిఉండగా, తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి స్వయంగా ఈ విచారణలో పాల్గొంటారని ముఖ్యమంత్రి తెలిపారు. కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

**ట్రిబ్యునల్ కు సాక్ష్యాధారాలు**

ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, మనకురావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలాసమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి న్యాయ నిపుణులకు పలు సూచనలు చేశారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నీ ట్రిబ్యునల్ కు సమర్పించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంట్లు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ కు అందించాలని సూచించారు.

**తెలంగాణకు అన్యాయం**

గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఆంధ్రప్రదేశ్ కు 512 టీఎంసీలు కట్టబెట్టి, 299 టీఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం 299 టీఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎం కు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతో ఈ పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైందన్నారు. కృష్ణా నదిపై తలపెట్టిన పాలమూరు రంగారెడ్డి నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్‌లో పెట్టిందన్నారు. నీటి వాటాల విషయంలో తీరని అన్యాయం చేసిందన్నారు.

దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించటంతో ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోయిందని, ఆ విషయాన్ని ట్రిబ్యునల్ ముందుకు తీసుకురావాలని సీఎం గారు చెప్పారు.

**ఏపీ జలదోపిడీ**

శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రోజుకు పది టీఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తుందని, ఇతర బేసిన్లకు తరలించుకుపోతోందని సీఎం రేవంత్ అన్నారు. ఎక్కడపడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతో పాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ ఆధారాలతో సహా ట్రిబ్యునల్‌కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ తో పాటు పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు మూతపడే ప్రమాదం ముంచుకు వచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జల విద్యుత్తు ఉత్పత్తికి విఘాతం కలుగుతోందన్నారు. ఈ విషయాలన్నీ ట్రిబ్యునల్ ఎదుట వాదనలుగా వినిపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కావటంతో తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునేందుకు అన్ని అర్హతలున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. సాగునీటి, తాగునీటి అవసరాలతో పాటు మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించుకోలేకపోయిందని గుర్తు చేయాలన్నారు.


**ఇదే సరైన అవకాశం**

తెలంగాణ తరఫున వాదనలను వినిపించేందుకు ఇదే సరైన అవకాశమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు, కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును దిశానిర్దేశం చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని ముఖ్యమంత్రి గారు న్యాయ నిపుణులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ సీఎస్ వైద్యనాథన్, సెంట్రల్ వాటర్ కమిషన్ మాజీ చైర్మన్ కుష్వీందర్ వోహ్రా, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ తో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్థాయిని మించి మాట్లాడుతున్న కేటీఆర్

- రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతికత కేటీఆర్ కు లేదు
- సీబీఐ విచారణ నుంచి బయట పడాలని కేటీఆర్ ప్లాన్: టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్

(మొదటిపేజీ తరువాయి)



కుమార్ గౌడ్ మండిపడ్డారు. కేటీఆర్ నీ స్థాయి ఏంటి..? అని ప్రశ్నించారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబం గురించి మాట్లాడే స్థాయి నీకుందా కేటీఆర్..? అని మండిపడ్డారు. గాంధీ భవన్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన టీ పీసీసీ చీఫ్ కాళేశ్వరం విచారణ నుంచి తప్పించుకునేందుకు మెప్పు కోసం బీజేపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని ధ్వజమెత్తారు. కేటీఆర్ వ్యాఖ్యల వెనక బీజేపీ నేతలు ఉన్నారని ఆరోపించారు. మోదీ మెప్పుకోసమే రాహుల్ గాంధీపై కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలపకపోవడంతోనే బీఆర్ఎస్ వైఖరి బట్టబయలు అయ్యిందన్నారు. ఓటింగ్ లో పాల్గొనమని చెప్పి పరోక్షంగా ఎన్డీయేకు మద్దతు తెలిపారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ వేరు కాదన్నారు. కవిత వ్యాఖ్యలతో బీజేపీలో బీఆర్ఎస్ మానసికంగా విలీనమైదని స్పష్టమైందన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు గురించి రాహుల్ గాంధీ ఎందుకు స్పందిస్తారని కేటీఆర్ ను ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు స్పీకర్ పరిధిలోని అంశమన్న విషయం తెలియదా అని అడిగారు. ఓట్ చోరీ పై ప్రపంచమంతా చర్చ జరుగుతుందని, ఓట్ చోరీ అంశాన్ని రాహుల్ గాంధీ బట్ట బయలు చేశారన్నారు. కాళేశ్వరం సీబీఐ విచారణ తప్పించుకునేందుకు బీఆర్ఎస్ నేతల నానా అగచాట్లు పడుతున్నారని విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కేసు విచారణ సీబీఐకి ఇవ్వమని కోరిన కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయాలని బీజేపీ కుటిల ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కోట నీలిమకు ఈసీ నోటీసులు జారీ చేయడం రాజకీయ కక్ష్య సాధింపు చర్యలో భాగమేనని అన్నారు. ఈసీ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈసీ నోటీసులను నీలిమా కోర్టులో చట్టపరంగా ఎదుర్కుంటారన్నారు. 2017లో కోట నీలిమ కుటుంబం చిరునామా మార్చాలని ఎన్నికల కమిషన్‌కు ఫామ్6 ఇచ్చినా ఈసీ చర్యలు తీసుకోలేదని, ఫామ్ 6 ప్రకారం తమ విధులు సక్రమంగా నిర్వహించని ఈసీ ఇప్పుడు బీజేపీ ఒత్తిడితో కోట నీలిమకు నోటీసులిచ్చిందన్నారు. తన విధులను మరిచిన ఈసీ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని, 48 గంటల్లో కాళేశ్వరం అవినీతిని తేలుస్తామని అన్న కిషన్ రెడ్డి ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారని ప్రశ్నించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంలో భాగంగానే కాళేశ్వరం పై విచారణ ఆగిందని భావిస్తున్నామన్నారు.



# రెండేళ్ల తర్వాత మణిపూర్ గుర్తొచ్చిందా

## ప్రధాని మోదీ పర్యటనపై ఎంపీ ప్రియాంక గాంధీ కౌంటర్

**వయనాడ్:** జాతుల మధ్య ఘర్షణ జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని మోదీ మణిపుర్‌లో పర్యటించారు. ఈ క్రమంలో ఆయన పర్యటనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మణిపుర్‌లో ఘర్షణలు జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని మోదీ అక్కడ పర్యటనకు వెళ్లడం దురదృష్టకరమన్నారు. భారత్‌లోని ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదంటూ విమర్శించారు. ప్రమాదాలు, విషాదాలు జరిగినప్పుడు ప్రధానులు వెంటనే అక్కడికి వెళ్తారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అందరు ప్రధానులు ఇదే పాటించారని తెలిపారు. కానీ, మోదీ మాత్రం రెండేళ్ల తర్వాత దీన్ని పాటిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఆయన ఇప్పటికే అక్కడ పర్యటించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

# సమస్యల పరిష్కారానికి ముందడుగు

## వెంకటేశ్వర కాలనీ డివిజన్ లో మన్నె గోవర్ధన్ రెడ్డి, కవితారెడ్డి పర్యటన



**బంజారాహిల్స్, మహా:** ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మన్నే కవితా రెడ్డి సూచించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లోని జర్నలిస్ట్ కాలనీ రామాలయం టెంపుల్ వద్ద డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ సమస్యలపై హెచ్ఎండబ్ల్యూఎస్ ఆఫీసర్ శ్యామ్, ఇన్స్పెక్టర్ రామకృష్ణతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వెంకటేశ్వర కాలనీ డివిజన్ ప్రగతిపథంలో ముందువరుసలో ఉందన్నారు.



# అనిత యాంకరా? లేక హోం మంత్రా?

- మాజీ మంత్రి రోజా ఫైర్
- మెడికల్ కాలేజీలు చూపిస్తా.. వస్తావా? అంటూ సవాల్

**తిరుపతి, మహా:** హోం మంత్రి వంగలపూడి అనిత యాంకరా? లేక హోం మంత్రా? అంటూ మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల నిర్మాణాల విషయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. శనివారం నగరిలో మీడియాతో మాట్లాడిన ఆమె, హోం మంత్రి అనితకు బహిరంగ సవాల్ విసిరారు. వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడితే, వాటిలో 7 కాలేజీలను జగన్ పూర్తి చేశారని రోజా అన్నారు. వీటిలో ఐదు కాలేజీలలో ఇప్పటికే తరగతులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. అయితే, మిగిలిన కాలేజీల పనులను ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తూ నిధులు కేటాయించడంలేదని ఆమె మండిపడ్డారు. "రాజమండ్రి, విజయనగరం, మచిలీపట్నం, నంద్యాల, పాడేరు మెడికల్ కాలేజీలను పరిశీలించడానికి మీరు వస్తారా హోం మంత్రి? ఆ కాలేజీలు ఎలా ఉన్నాయో, విద్యార్థులు ఎలా చదువుకుంటున్నారో నేనే స్వయంగా చూపిస్తాను" అంటూ రోజా సవాల్ విసిరారు.



# అవినీతి నిర్మూలనకు ఏఐ మంత్రి

## అల్బేనియా ప్రధాని సంచలన ప్రకటన

**మహా:** కృత్రిమ మేధ (ఏఐ) రాకతో పెను మార్పులు సంభవిస్తున్నాయి. అనేక రంగాల్లో ఇప్పుడు ఏఐను జోడిస్తూ సంచనలం కూడా సృష్టిస్తున్నారు. ఇదే కోవలో అవినీతిపై అల్బేనియా దేశం ఏఐ అస్త్రాన్ని ఎంచుకుంది. ఏఐతో సృష్టించిన బాట్‌కు అల్బేనియా ప్రధాని కేబినెట్‌లో చోటు కల్పించారు. డైఎల్లా పేరు గల వర్చువల్ మంత్రి భౌతికంగా కనిపించకపోయినా అవినీతి భరతం పడతారని తెలిపారు. అవినీతి నిర్మూలనకు ఏఐ మంత్రి కృషి చేస్తారని ప్రధాని ప్రకటించారు. ఇందుకోసం సాంకేతిక దిగ్గజం మైక్రోసాఫ్ట్ సాయం తీసుకుంటున్నట్లు వివరించారు. 'డిఎల్లా' అనే పేరుతో రూపొందించిన వర్చువల్ వ్యక్తి కొత్త ఏఐ మంత్రిగా పనిచేస్తారని ప్రధాని ఎడి రామా వివరించారు. అల్బేనియా భాషలో సూర్యుడిని స్త్రీరూపంలో 'డిఎల్లా' అని పిలుస్తారు. డిఎల్లా మంత్రివర్గంలో సభ్యురాలు అయిందని భౌతికంగా కనిపించకపోయినా వర్చువల్‌గా ఉంటుందని ప్రధాని ఎడి రామా ఫేస్‌బుక్ పోస్ట్‌లో వెల్లడించారు. ఎడి రామా సోషలిస్టు పార్టీ మే 11 జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో 140 సీట్లకుగాను 83 చోట్ల గెలిచి నాలుగోసారి అధికారం కైవసం చేసుకుంది. ఆ సందర్భంగా పబ్లిక్ టెండర్లలో 100శాతం పారదర్శకత కోసం డిఎల్లా పనిచేస్తుందని ప్రధాని వివరించారు.

### శంకర్‌పల్లి దారి దోపిడీ కేసులో

# డ్రైవరే అసలు సూత్రధారి

## జడ్చర్లలో ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్, మహా :** శివారు శంకర్‌పల్లి ప్రాంతంలో పట్టపగలు జరిగిన దారి దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి స్టీల్ వ్యాపారి దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్న మధు అని పోలీసులు నిర్ధారించారు. వికారాబాద్ నుంచి రూ. 40 లక్షల నగదు తీసుకొస్తుండగా సినీ ఫక్కీలో దొంగలు దాడి చేసినట్లు డ్రామా క్రియేట్ చేసిన మధు తన గ్యాంగ్‌తో కలిసి ఈ నేరానికి పాల్పడ్డాడు. మేడ్చల్ జిల్లా కీసరకు చెందిన స్టీల్ వ్యాపారి రాకేశ్ అగర్వాల్ తన వ్యాపారానికి సంబంధించిన రూ. 40 లక్షలు వసూలు చేయడానికి తన డ్రైవర్ మధు, సహాయకుడు సాయిబాబాను శుక్రవారం ఉదయం వికారాబాద్ పంపించాడు. డబ్బు తీసుకుని వీరు కారులో తిరిగి వస్తుండగా శంకర్‌పల్లి మండలం హుస్సేన్‌పూర్‌పర్వేద గ్రామాల మార్గంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఆ తర్వాత ఆ కారు రోడ్డుకు అడ్డంగా ఆగిపోయింది. మాస్కులు ధరించిన ముగ్గురు వ్యక్తులు కారు దిగి, డ్రైవర్ మధు, సహాయకుడు సాయిబాబాను రాయితో కారు అద్దం పగలగొట్టి నకిలీ తుపాకీ, కత్తితో బెదిరించారు. వారు భయపడి డబ్బుల బ్యాగు ఇవ్వగానే నిందితులు కారులో పరారయ్యారు. అయితే వారు నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లగానే కొత్తపల్లి వద్ద దొంగలు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని బోల్తా పడింది. ఈ క్రమంలో డబ్బులున్న బ్యాగులో కొంత మొత్తం కింద పడిపోయింది. నిందితులు సుమారు రూ. 8.5 లక్షలు అక్కడే వదిలేసి మిగతా డబ్బుతో పారిపోయారు. ఈ ఘటనపై మధు, సాయిబాబా పోలీసులకు సమాచారం అందించారు. అటుగా వచ్చిన శంకర్‌పల్లి పోలీసులు బోల్తా పడిన కారును రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న డబ్బును చూసి ఆశ్చర్యపోయారు. స్థానికుల నుంచి ఎనిమిదన్నర లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, నిందితులు ఉపయోగించింది నకిలీ తుపాకీ అని గుర్తించారు. అంతేకాకుండా బోల్తాపడిన కారులో పురెలతో చేసిన దండలు, మద్యం సీసాలు కూడా లభ్యమయ్యాయి. ఆ కారు జడ్చర్లకు చెందిన వ్యక్తిదిగా గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులకు ఈ కేసులో కొన్ని అనుమానాలు కలిగాయి. మొత్తం సంఘటనను పరిశీలించగా ఇది దారి దోపిడీ కాదని, పక్కా ప్లాన్ ప్రకారమే ఘటన జరిగి ఉంటుందని గ్రహించారు. ఈ మేరకు డ్రైవర్ మధుపై అనుమానంతో విచారణ వేగవంతం చేశారు. వికారాబాద్ నుంచి నగదు తీసుకు వస్తున్న విషయాన్ని డ్రైవర్ మధు తన గ్యాంగ్‌కు చెప్పి దోపిడీకి సంబంధించిన మొత్తం ప్రణాళికను సిద్ధం చేశాడని పోలీసులు కనుగొన్నారు. మధు, సాయిబాబాపై దాడి చేసినట్లు నటించి మిగతా దుండగులు డబ్బుతో పారిపోయినట్లు నిర్ధారించారు. ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి డ్రైవర్ మధు అని తేలింది. ఈ కేసును ఛేదించడానికి పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ దోపిడీకి పాల్పడిన ఏడుగురిని జడ్చర్లలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఈ అరెస్టులతో కేసు కొలిక్కి వచ్చింది. డ్రైవర్ మధు ఒక మహానటుడి మాదిరిగా నటించి.. తనపై దాడి జరిగినట్లు నమ్మించడానికి ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు.

# బీఆర్ఎస్ సచ్చిపోయింది..

- కేటీఆర్‌ను చూస్తే జాలి వేస్తోంది
- దోపిడీ సొమ్ము వాటాల్లో తేడాల వల్లే కుటుంబ కలహాలు
- ఏ మొహం పెట్టుకొని పాలమూరుకు వస్తారు
- పాలమూరు వెనకబాటు పాపం మీది కాదా?
- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సంచలన కామెంట్స్



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై మహబూబ్ నగర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌ను చూస్తే తనకు జాలి కలుగుతోందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ గద్వాల పర్యటనపై ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఇంట్లోనూ, ఫామ్‌హౌస్‌లోనూ ఉండలేని పరిస్థితుల్లోనే కేటీఆర్ గాలికి తిరగడానికి బయటకు వచ్చారని అన్నారు. కుటుంబ సభ్యుల నుంచి ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకోలేకే ఆయన జిల్లాల బాట పట్టారని మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. "ఒకవైపు సోదరి కవిత, మరోవైపు బావ హరీశ్‌రావు, ఇంకోవైపు తండ్రి కేసీఆర్ నుంచి వస్తున్న ఒత్తిళ్లతో కేటీఆర్ సతమతమవుతున్నారు. ఏం చేయాలో తెలియక, పార్టీ నాయకులు ఒక్కొక్కరుగా జారుకుంటుండటంతో ఇలా పర్యటనలు చేస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందని, ఈ నిజాన్ని కేటీఆర్ ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిదని హితవు పలికారు. ఆ పార్టీకి ఎన్ని లేపనాలు పూసినా లాభం లేదని, అవినీతి కంపు తప్ప మరో వాసన రాదని తీవ్రస్థాయిలో విమర్శించారు. కేటీఆర్ పర్యటనల వల్ల డీజిల్ ఖర్చు తప్ప మరే ప్రయోజనం లేదని, సోషల్ మీడియాలో స్టంట్ల కోసమే ఆయన సభలు పెడుతున్నారని ఆరోపించారు. "బీఆర్ఎస్ చెప్పే చెత్త కబుర్లు వినడానికి తెలంగాణ ప్రజలు అమాయకులు కాదు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన పాలమూరు ప్రజలు వారిని ఫామ్‌హౌస్‌కు పంపారు. వారి హయాంలో పాలమూరురంగారెడ్డి, తుమ్మిడిహట్టి, జూరాల వంటి కీలక ప్రాజెక్టులను గాలికొదిలేశారు" అని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే జూరాలపై రూ. 120 కోట్లతో కొత్త వంతెన నిర్మిస్తోందని తెలిపారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాత తమ ప్రాంతానికి ఏ పార్టీ అవసరం లేదన్నారు. పదేళ్ల పాటు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని మింగేసిన బకాసురులు బీఆర్ఎస్ నేతలని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.



# కవిత కుటుంబంతో కలవడం ఖాయం

## బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పార్టీ మారకుంటే కేటీఆర్ మీటింగ్ కు పోవాలి

బీజేపీ ఎంపీ డీకే అరుణ

**మహబూబ్ నగర్, మహా:** రేపు మాపో కవిత కుటుంబంతో కలవడం ఖాయమని మహబూబ్ నగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కవిత గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. నాలుగు రోజుల్లో తల్లీపిల్లలు కలుస్తారన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కోర్టు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. ఆనాడు కండువా కప్పుకొని పార్టీ మారి.. ఈరోజు అది దేవుడి కండువా అంటూ బుకాయిస్తారా? అని ప్రశ్నించారు. ఇంత నీచ రాజకీయం తాము ఎప్పుడూ చూడలేదని ఫైర్ అయ్యారు. బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పార్టీ మారకుంటే గద్వాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీటింగ్ కు వెళ్లాలన్నారు. గద్వాలకు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. గద్వాల ప్రజలను అడిగితే ఈ విషయం చెబుతారన్నారు.

# పార్టీ మారింది..అభివృద్ధి కోసమా? నీ సొంత అభివృద్ధి కోసమా?

(మొదటిపేజీ తరువాయి)

మీటింగ్ పెట్టానని తెలిపారు. ఆ సమయంలో కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అవసరమైతే రైలు కింద తలపెట్టి చచ్చిపోతా కానీ కాంగ్రెస్‌లో చేరనని అన్నాడని గుర్తుచేశారు. మరి ఇవాళ ఎవరి అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లావని కృష్ణమోహన్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమా? నీ సొంత అభివృద్ధి కోసమా? ఎందుకు పార్టీ మారవని నిలదీశారు. ఈ 22 నెలల్లో గద్వాలలో ఏం అభివృద్ధి జరిగిందని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గద్వాలకు కొత్తగా ఒక్క రూపాయి అయినా మంజూరయ్యిందా అని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు అని చెప్పి అరచేతిలో స్వర్గం చూపించారని అన్నారు. ఎన్నికల ముందు ఎన్నెన్నో మాటలు చెప్పారని పేర్కొన్నారు. కేసీఆర్ రైతుబంధు 10 వేలు ఇస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 15 వేలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. మరి 15 వేలు వస్తున్నాయా అని ప్రజలను ప్రశ్నించారు. రైతుబంధు 15 వేలు వస్తుందని కృష్ణమోహన్ రెడ్డి పార్టీ మారాడా అని మండిపడ్డారు. కేసీఆర్ 2 వేలు పెన్షన్ ఇస్తే.. నేను రూ.4వేలు ఇస్తానని చెప్పారని తెలిపారు. మరి 4వేల పెన్షన్ వస్తుందని పార్టీ మారాడా అని ప్రశ్నించారు. ఆడబిడ్డ పెళ్లికి కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద లక్ష రూపాయలు ఇస్తుంటే, నేను మీద నుంచి తులం బంగారం ఇస్తానని అన్నారని తెలిపారు. మరి తులం బంగారం వస్తుందా అని ప్రశ్నించారు. తులం బంగారం కోసం పార్టీ మారాడా అని ప్రశ్నించారు.

**మనకైనా సిగ్గు ఉండాలి కదా..**

ఆడబిడ్డలకు రూ.2500లు ఇస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడని కేటీఆర్ గుర్తుచేశారు. అత్తకు రూ.4 వేలు, కోడలికి రూ.2500 ఇస్తానని మాట ఇచ్చారని అన్నారు. ఏ ఆడబిడ్డకు అయినా రూ.2500 వచ్చాయా అని ప్రశ్నించారు. 1.67 కోట్ల మంది రూ.2500 కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని చూస్తున్నారని తెలిపారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పారని.. మరి రుణమాఫీ అయ్యిందా అని ప్రశ్నించారు. రుణమాఫీ అయ్యిందని ఎమ్మెల్యే పార్టీ మారాడా అని అడిగారు. ఇప్పుడు మీడియా అడిగితే బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని కృష్ణమోహన్ రెడ్డి చెప్పడం సిగ్గులేని విషయమని మండిపడ్డారు. మరి బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతుంటే.. బీఆర్ఎస్ మీటింగ్ ఇక్కడ అవుతుంటే.. ఎక్కడ ఉన్నావని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. బీఆర్ఎస్ మీటింగ్ అవుతుంటే.. ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నాడని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సంకల కృష్ణమోహన్ రెడ్డి ఉన్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి దగ్గర ఉండి.. బీఆర్ఎస్‌లోనే ఉన్నానని సన్నాయి నొక్కులు నొక్కితే ఎవరు నమ్ముతారని అన్నారు. ఆయనకు సిగ్గులేకపోయినా.. మనకైనా సిగ్గు ఉండాలన్నారు. ఎవరెన్ని ఎత్తుగడలు వేసినా.. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. సుప్రీంకోర్టు మాత్రం సీరియస్‌గా ఉందని అన్నారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయకతప్పదు.. ఉప ఎన్నిక రాక తప్పదని స్పష్టం చేశారు. వచ్చే ఆరు నుంచి 9 నెలల్లో ఇదే గద్వాలలో తిరిగి ఉప ఎన్నిక వస్తుందని కేటీఆర్ తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. పెద్దనాయకులు పార్టీని వదిలిపెట్టినప్పటికీ చాలామంది ఇక్కడే ఉన్నారని తెలిపారు. బలమైన సర్పం కూడా చలిచీమల చేతచిక్కి సచ్చినట్లు.. ఇవాళ బలవంతుడిగా కనిపించే ఎమ్మెల్యే గానీ.. కాంగ్రెస్ గానీ.. మీ దెబ్బకు దిగిరాక తప్పదని అన్నారు. గద్వాలలో జోష్ చూస్తుంటే.. ఉప ఎన్నిక రావడం ఖాయం.. అందులో 50 వేల మెజారిటీతో గులాబీ జెండా ఎగరడం ఖాయమని అనిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



# అక్రమార్కులను అణచివేయండి

## అక్రమ మద్యం, డ్రగ్స్, గంజాయి, రవాణా, విక్రయాలు, వినియోగంపై ఉక్కు పాదం మోపండి

## ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, మహా :** గంజాయి, డ్రగ్స్, నాటుసారా, ఎన్‌డీపీఎల్ నేరాలపై ఉక్కు పాదం మోపాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. నాంపల్లిలోని తెలంగాణ అబ్కారీ భవన్‌లో శనివారం అబ్కారీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్ అండ్ డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పనితీరుపై మంత్రి సమీక్షించారు. అక్రమ, కల్తీ మద్యం, కల్తీ కల్లు, డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగం, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్, చర్లపల్లి ప్యాక్టరీలో డ్రగ్స్ ముడి సరుకు తయారీ, ఎన్డీపీఎస్ కేసుల పురోగతి, శిక్షల రేషియో, పాత నేరస్తుల, నిందితులపై నిఘా, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోను రాష్ట్రంలో అక్రమ మద్యాన్ని, గంజాయి తదితర మాదక ద్రవ్యాల సరఫరా అనేది ఉండకూడదన్నారు. సరిహద్దు రాష్ట్రాల అధికారులతో సమన్వయంతో పాటు వీటితో సంబంధం ఉన్న కింగ్ పిన్లను గుర్తించి వారిని పీడీ యాక్టు కింద అరెస్టు చేయాలని ఆదేశించారు.

యువత భవిష్యత్తును అంధకారం చేస్తున్న గంజాయి, మాదకద్రవ్యాల లాంటి మత్తు పదార్థాల విక్రయానికి అడ్డుకట్ట వేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రగ్స్, సింథటిక్ డ్రగ్స్, గంజాయి, కల్తీ మద్యం, నాటుసారా, కల్తీ కల్లు తాగి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, ప్రజల ప్రాణాలు తీసేవి ఇక రాష్ట్రంలో కనిపించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో రాజీ పడొద్దని, తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. నిఘా, విస్తృత తనిఖీలను చేపట్టాల్సిన అవసరం ఉందని, మరింత అప్రమత్తతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. అలాగే సరిహద్దు రాష్ట్రాల చెక్ పోస్టుల్లో నిఘాను మరింత పటిష్టం చేయాలని చెప్పారు. నిఘాను కేవలం చెక్ పోస్టులకే పరిమితం కాకుండా ఆయా గ్రామాల్లోని ఇతర మార్గాలు, సోర్సులపై కూడా ముమ్మరం చేసి దీనిలో భాగస్వాములైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఆయుధాల విషయంలో అధ్యయనం**

ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆయధాలు అప్పగించే అంశంలో నిబంధనలు ఏం చెప్పుతున్నాయి? దీనికి ఉన్న అడ్డంకులు ఏంటీ? ఇతర రాష్ట్రాల్లో ఎక్కడైనా ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆయుధాలు అప్పగించారా? దీని కోసం ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటుసారా తయారీ అమ్మకాలు, కల్తీ మద్యం తయారీతో పాటు ఎన్డీపీఎస్ యాక్టు క్రింద కేసులు నమోదు చేయడమే కాకుండా, నమోదు చేసిన కేసుల్లో ఎంతమంది నిందితులకు శిక్షలు పడుతున్నాయని ఆరా తీశారు. కేసు నమోదు, పంచనామా నుంచి చార్జిషీట్ దాఖలు, ట్రయల్ సందర్భంలో సమర్ధవంతంగా వాదనలు వినిపించి నిందితులకు శిక్షలు పడే వరకు విశ్రమించకుండా పని చేయాలని సూచించారు.

**చర్లపల్లి డ్రగ్స్ ఫ్యాక్టరీపై సుదీర్ఘ చర్చ**

చర్లపల్లిలోని ఓ ప్యాకర్టీలో డ్రగ్స్ ముడిసరుకు తయారీ కేసులో పురోగతి, ఎక్సైజ్ శాఖ తనిఖీ, బయటపడ్డ అంశాలపై ఇచ్చిన నివేదిక గురించి మంత్రి ఆరా తీశారు. మహారాష్ట్ర దర్యాప్తు సంస్థ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టులో ఏముందని అడిగారు. ఈ కేసులో మహారాష్ట్ర పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషిద్ధ వస్తువులు, ఇతర వస్తువుల విలువ రూ. 12 వేల కోట్లుగా వార్తలు వచ్చాయని, దీనికి ఎటువంటి ఆధారాలు లేవని, స్వాదీనం చేసుకున్న వాస్తవ విలువ గురించి మహారాష్ట్ర పోలీసుల నుంచి ఇంకా తెలియాల్సి ఉందని, విశ్వసనీయ సమాచారం ప్రకారం వాటి విలువ సుమారు 11.95 కోట్లు మాత్రమేనని అధికారులు మంత్రికి వివరించారు. చర్లపల్లి వంటి ఘటనల వల్ల మన విశ్వనీయతను కొల్పేయే ప్రమాదం ఉందని, భవిష్యత్ లో ఇలాంటివి పునరావృతం కాకుండా నిఘాను మరింత పటిష్టం చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పరిశ్రమల్లో విస్తృత సోదాలు నిర్వహించాలని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

గోవాలో పెన్నీ, మధ్యప్రదేశ్ లో ఇప్ప సారా (మహూవా) వంటి సాంప్రదాయ మద్యాన్ని బ్రాండింగ్ చేసి విక్రయిస్తున్నారని, తెలంగాణలో ఈత, తాటి కల్లును కూడా అదే తరహాలో టొడి నేచురల్ బ్రూవరి నెలకొల్పి బాట్లింగ్ చేసి విక్రయించే యూనిట్ లను నెలకొల్పడం వల్ల గీత కార్మికులకు ఉపాధితో పాటు ఆదాయం పెరుగుతుందని, కల్తీ కల్లును కూడా నివారించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. దీనిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని చెప్పారు. నివేదిక ఆధారంగా సీయం రేవంత్ రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. దాడుల సందర్భంలో స్వాధీనం చేసుకున్న నల్లబియ్యాన్ని వృధాగా పారబోయకుండా దాన్ని రైతులకు విక్రయించడానికి ఉన్న నిబంధనలు ఎంటి? అదే విధంగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను ధ్వంసం చేయకుండా, దాని నాణ్యతను ల్యాబ్ లో పరీక్షించి, తిరిగి విక్రయించేందుకు ఉన్న అడ్డంకులు, నిబంధనలు ఎంటనేదానిపై అధ్యయనం చేయాలని సూచించారు.

**ప్రైవేట్ పార్టీలపై దృష్టి పెట్టండి**

ఫంక్షన్ హాల్స్, రిసార్టు, ఫాంహౌస్ ల్లో జరిగే ప్రైవేట్ పార్టీల్లో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం వినియోగంపై అబ్కారీ శాఖ దృష్టి సారించాలన్నారు. ఈ క్రమంలో ఫంక్షన్లు, పార్టీలపై కూడా అబ్కారీ శాఖ ఓ కన్నేసి ఉంచాలని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక నిఘా పెట్టాలని, ఎక్సైజ్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒక బారుకు అనుమతి తీసుకుని , రెండు మూడు బార్లను నడుపుతుండటంతో పాటు ఒక అంతస్తులో బారు నడపడానికి అనుమతి తీసుకుని రెండు, మూడు అంతస్తుల్లో బార్లను నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తూతూ మంత్రంగా కంపౌండ్ ఫీజు వసూలు చేయడమే కాకుండా నిబంధలను అతిక్రమించిన బార్ల లైసెన్స్ లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారికి, సహకరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, కమిషనర్ సి.హరి కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, అడిషనర్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, అన్ని జిల్లాల డిప్యూటి కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్, డీటీఎఫ్ టీమ్స్ అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి కావాలనే టికెట్ కోరుతున్నా..

- జూబ్లీహిల్స్‌లో నేనే అసలైన లోకల్ లీడర్
- పొన్నం నాకంటే జూనియర్.. నేనేమీ పాకిస్థాన్ నుంచి రాలేదు కదా?
- జూబ్లీహిల్స్ లో గెలిస్తే నాకు కేబినెట్ బెర్త్ చాన్స్ ఉంటుంది
- మీడియా చిట్ చాట్‌లో కాంగ్రెస్ నేత అంజన్ కుమార్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ సీనియర్ లీడర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి కావాలనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోరుతున్నానని, ప్రజలు కూడా టికెట్ నాకే ఇవ్వాలని కోరుకుంటున్నారని వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణ మంత్రివర్గంలో తమ యాదవ సామాజిక వర్గం నుంచి మంత్రి లేరని.. యాదవ సామాజిక వర్గంలో కాంగ్రెస్ పార్టీలో తాను సీనియర్ నాయకుడినని చెప్పుకొచ్చారు. అదిగాక గ్రేటర్ హైదరాబాద్ నుంచి కేబినెట్‌లో చోటు లేదని, తాను జూబ్లీహిల్స్ లో గెలిస్తే నాకు కేబినెట్ బెర్త్ చాన్స్ ఉంటుందన్నారు. తన కుమారుడికి యూత్ కాంగ్రెస్ కోటలో రాజ్యసభ సీటు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నానని, తనకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరుతున్నానని తెలిపారు. పార్టీలో తాను సీనియర్ నాయకుడినని, మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా నాకంటే జూనియర్ యేనన్నారు. జూబ్లీహిల్స్ లో నేనే అసలైన లోకల్ లీడర్ అని.. నేను పాకిస్థాన్ నుండి రాలేదు కదా? అన్నారు. నాలుగు సార్లు ఎంపీగా పోటీ చేసిన్నపుడు ఇక్కడి ప్రజలు నాకు ఓట్లు వేశారని, తాను ఈ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశానని చెప్పారు.

# నేనైతే ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నా..

- స్పీకర్ నుంచి ఇంకా నాకు నోటీసులు అందలేదు
- వచ్చాక న్యాయ సలహా తీసుకుని సమాధానం ఇస్తా
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హాట్ కామెంట్స్



**హైదరాబాద్, మహా:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హాట్ కామెంట్స్ చేశారు. పార్టీ ఫిరాయింపుపై అసెంబ్లీ స్పీకర్ నుంచి ఇంకా తనకు నోటీసులు అందలేదని వెల్లడించారు. నోటీసులు వచ్చిన తర్వాత అందులో సారాంశాన్ని పరిశీలించి, న్యాయ సలహా తీసుకుని సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఫిరాయింపు వివాదంలోని 10 మందిలో ఒక్కొక్కరికి స్పీకర్ నుంచి నోటీసులు వస్తున్నాయని, నోటీసులు వచ్చిన వారు స్పీకర్‌కు సమాధానం ఇస్తున్నారన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పనులు, నిధుల మంజూరు జరిపిస్తున్నామని తెలిపారు. ఇప్పటిదాక చేపట్టిన పనులు, కొత్తగా మంజూరైన పనుల వివరాలను దానం వివరించారు. శనివారం రెడ్డి కాలనీలో సీసీ రోడ్లు, వీధి దీపాలను ప్రారంభించుకున్నామని తెలిపారు.

# మిజోరంలో ఫస్ట్ రైల్వే లైన్..

- బైరబీ-సైరాంగ్ రైల్వే లైన్‌ను జాతికి అంకితం చేసిన మోదీ
- ఢిల్లీ, కోల్‌కతా, గువాహటిలకు మూడు కొత్త రైలు సర్వీసుల ప్రారంభం
- రూ.8, 070 కోట్లతో నిర్మాణం.. 45 టన్నెల్స్, 55 మేజర్, 88 మైనర్ బ్రిడ్జిలు



**మిజోరం:** ఈశాన్య రాష్ట్రం మిజోరంను తొలిసారిగా భారత రైల్వే నెట్‌వర్క్‌కు అనుసంధానిస్తూ ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.8,070 కోట్లతో నిర్మించిన బైరబీ సైరాంగ్ లైన్‌ను జాతికి అంకితం చేశారు. దీంతో కొత్త లైన్ మిజోరంలోని సైరాంగ్‌ను రాజధాని ఎక్స్‌ప్రెస్ ద్వారా ఢిల్లీతో నేరుగా కలుపుతుందని, రాష్ట్రాన్ని జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించడంలో ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన నొక్కి చెప్పారు. కొండ ప్రాంతంలో 45 టన్నెల్స్, 55 మేజర్, 88 మైనర్ బ్రిడ్జిలతో దీన్ని పూర్తి చేశారు. మిజోరంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతదేశ బలమైన ఆర్థిక పనితీరును హైలైట్ చేశారు. 202526 మొదటి త్రైమాసికంలో దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి చెందిందని, ఇది ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా, ఎగుమతుల పురోగతిని ఆయన నొక్కిచెప్పారు. ఆర్థిక, తయారీ వృద్ధిని జాతీయ భద్రతకు అనుసంధానించారు.ఆపరేషన్ సిందూర్‌లో మేడ్ఇన్ఇండియా ఆయుధాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కొన్ని పార్టీల ఓట్ బ్యాంక్ రాజకీయాలతో ఈశాన్య రాష్ట్రాలన్నీ తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. తాము 11 ఏళ్లుగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇండియా గ్రోత్ ఇంజిన్‌గా నార్త్‌ఈస్ట్ మారిందన్నారు. తొలిసారిగా రోడ్స్, హైవేలు, రైల్వే కనెక్టివిటీ, ఎలక్ట్రిసిటీ సౌకర్యాలు కల్పించామన్నారు. ట్రేడ్, టూరిజం వృద్ధి చెందుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# డీజీపీ ఎదుట లొంగిపోయిన సుజాత

## సీపీఐ మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్‌గా ఉన్న సుజాత



**హైదరాబాద్, మహా :** మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు సుజాత శనివారం డీజీపీ జితేందర్ ఎదుట లొంగిపోయారు. సీపీఐ మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్‌గా సుజాత ఉన్నారు. గద్వాలకు చెందిన సుజాత అలియాస్ పోతుల కల్పన 1984లో కిషన్‌జీని వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఈమెపై 106 కేసులున్నాయి. 43 ఏళ్లుగా ఆమె అజ్ఞాతంలో ఉన్న సుజాత లొంగుబాటు అనంతరం డీజీపీ జితేందర్ మీడియాతో మాట్లాడారు. మావోయిస్టులతో చర్చలతో ఏలాంటి ఉపయోగం లేదన్నారు. గతంలో జరిగిన చర్చలతో ఏలాంటి ఫలితాలు రాలేదని పేర్కొన్నారు. 43 ఏళ్లుగా నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో అజ్ఞాతంలో పనిచేసిన సుజాత అనారోగ్యం దృష్ట్యా లొంగిపోయారని పేర్కొన్నారు. ఆమెపై రూ.25 లక్షల రివార్డు ఉందని, ఆ రివార్డు మొత్తాన్ని డీడీ రూపంలో సుజాతకు అందజేస్తామని తెలిపారు. పునరావాసంలో భాగంగా అన్ని ప్రయోజనాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆగు మల్లోజుల కోటేశ్వరావు అలియాస్ కిషన్‌జీని ఆమె వివాహం చేసుకున్నారని, 2011 నవంబర్‌లో కిషన్ జీ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని డీజీపీ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 404 మంది యూజీ క్యాడర్లు, నలుగురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక డివిజన్ కమిటీ కార్యదర్శి, 8 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 34 మంది ఏరియా కమిటీ సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారని డీజీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం సీపీఐ మావోయిస్టు పార్టీలో తెలంగాణకి చెందిన వారు 78 మంది మాత్రమే ఉన్నారని డీజీపీ పేర్కొన్నారు. 15 మంది కేంద్ర కమిటీ సభ్యుల్లో 10 మంది తెలంగాణకు చెందినవారున్నరన్నారు. మావోయిస్టుల లొంగుబాటు అనేది అంత సులభంగా జరుగదని, పోలీసులకు మావోలు లొంగిపోవాలంటే ప్రాసెస్ ఉంటుందని, దాని ప్రకారం లొంగిపోతారన్నారు. గత ఏడాది తెలంగాణలో జరిగిన ఎన్‌కౌంటర్లలో 22 మంది మావోయిస్టులు చనిపోయారని, ఈ ఏడాది ఇప్పటి వరకు 10 మంది మావోయిస్టులు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని తెలిపారు. గతంలో కూడా పోలీసులకు మావోయిస్టులకు మధ్య చర్చలు జరిగాయని, అయినా కూడా ఎలాంటి ప్రగతి సాధించలేదని డీజీపీ గుర్తు చేశారు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో మావోయిస్టులు వారిని కాపాడుకునేందుకే చర్చల ప్రతిపాదనను తెరపైకి తీసుకొస్తున్నారని తెలిపారు. తెలంగాణ కమిటీలో 11మంది మావోయిస్టులు తెలంగాణ వారు, ఇతర రాష్ట్రాల వారు 62 మంది ఉన్నట్లు గుర్తించాం. తెలంగాణ కమిటీలో మొత్తం 73మంది మావోయిస్టులు ఉన్నట్లు గుర్తించామని డీజీపీ పేర్కొన్నారు.

# రూ. 232 కోట్లతో పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం

## మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**నల్గొండ, మహా :** రాష్ట్రవ్యాప్తంగా రూ. 232 కోట్లతో పోలీసు అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణం చేపట్టడం జరిగిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ లో నిర్మించిన ఏఆర్ డీఎస్‌పి రెసిడెన్సి క్వార్టర్స్ , సీఐ,ఎస్ఐ క్వార్టర్లను, శిశువిహార్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శిథిలావస్థలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ ను తొలగించి వాటి స్థానంలో కొత్త క్వార్టర్లను నిర్మిస్తున్నామని, ఇందులో భాగంగానే అవసరమైనచోట 232 కోట్ల రూపాయలతో పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ఇంకా ఎక్కడైనా ఇలాంటి స్థితిలో క్వార్టర్స్ ఉన్నట్లయితే గుర్తించి వాటిని స్థానంలో కొత్త వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి రమేష్ రెడ్డిని ఆదేశించారు. నల్గొండ జిల్లా డీఎస్పీ కార్యాలయం 50 సంవత్సరాల క్రితం నిర్మించారని, త్వరలోనే ఈ కార్యాలయాన్ని కూలగొట్టి దాని స్థానంలో కొత్తది మంజూరు చేయిస్తామని, సీఎంతో మాట్లాడి డీఎస్పీ కార్యాలయంతో పాటు, ఏఆర్ కానిస్టేబుల్ క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నందున వాటికి కూడా మంజూరు చేయించడం జరుగుతుందని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది 24 గంటలు పనిచేస్తారని, అలాంటివారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. హింసను నిర్మూలించి, శాంతియుత వాతావరణం నెలకొల్పడంతో పాటు, సమాజంలో మత్తుమందుల నిర్మూలన కు పోలీసులు కృషి చేస్తున్నారని, ప్రత్యేకించి నల్గొండ జిల్లాలో జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్లు మత్తుపదార్థాల నివారణకు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు.








WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# అమరావతి.. తిరుగులేని పురోగతి

ఏపీ సీఎం చంద్రబాబు అమరావతిని నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారు. అమరావతిలో ఇప్పుడు యాభై వేల కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయి. ప్రైవేటు పెట్టుబడులు కూడా కలిస్తే.. వచ్చే మూడేళ్ళలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో నిర్మాణం జరుగుతుంది. ప్రస్తుతం అమరావతి స్థిరపడుతుందన్న భావన సర్వత్రా వ్యాపించిన వేళ వైసీపీ కూడా తాము భవిష్యత్ లో గెలిస్తే అమరావతి రాజధానిగానే పరిపాలన ఉంటుందని స్పష్టత ఉంటుంది. తద్వారా రాజధాని చర్చకు సంపూర్ణంగా తెరదించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ అమరావతి మధ్య హైవే, రైలు మార్గాలకు సంబంధించి ప్రతిపాదనలు తయారుచేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ఏపీలోని వైసీపీ అమరావతి రూటులోకి వచ్చింది. అమరావతిపై గతంలో కమ్ముకున్న అనుమానపు మేఘాలు తొలిగి.. అద్భుత నగరం ఆవిష్కృతం అవుతుందన్న విశ్వాసం జనబాహుళ్యంలో పెరిగింది.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎంఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్



అమరావతి ఏపీ రాజధానిగా పదేళ్ళక్రితమే జరిగిన నిర్ణయం. మధ్యలో అనేక అవాంతరాలు.. అనుమానాలొచ్చినా, ఇపుడు అమరావతి కేంద్రంగా జరుగుతున్న పనుల ఆచరణ చూసి వైసీపీ కూడా ఇక్కడి నుండే పాలన అని స్పష్టత ఇవ్వక తప్పలేదు. గతంలో కూడా జగన్ అంగీకరించి, తాడేపల్లిలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నా అధికారంలోకి వచ్చాక రకరకాల విన్యాసాలు చేసి అపనమ్మకం కలిగించారు. అమరావతిని అవహేళన చేయడం వల్ల జగన్ కు కలిగిన రాజకీయ ప్రయోజనం ఏమీలేదు. దానిని ఇంకా మెరుగుపరిచి ఉంటే హైదరాబాద్ విషయంలో వైఎస్సార్ కు వచ్చిన పేరు జగన్ కు కూడా వచ్చేది. తప్పుడు సలహాదారులతో జగన్ నష్టపోయారు. ఇప్పటికైనా అమరావతి విషయంలో వైసీపీ స్పష్టతకు వచ్చినట్లు కనబడుతోంది. అమరావతిపై చర్చే అసంబద్ధం. అమరావతిలో ఇప్పుడు యాభై వేల కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయి. ప్రైవేటు పెట్టుబడులు కూడా కలిస్తే.. వచ్చే మూడేళ్ళలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో నిర్మాణం జరుగుతుంది. ప్రస్తుతం అమరావతి స్థిరపడుతుందన్న భావన సర్వత్రా వ్యాపించిన వేళ ఏపీలోని రాజకీయపక్షాలన్నీ ఒకే మాటమీదికి రావడం ఏపీ భవిష్యత్తుకు శుభసూచకమే. అపనమ్మకాలను పారద్రోలడమే.

తాము అధికారంలోకి వస్తే ఏపీ రాజధానిగా అమరావతి ఉంటుందని వైసీపీ ఇపుడు మళ్ళీ పాత పాట పాడుతోంది. మొదట మూడు రాజధానుల ఆలోచనతో ప్రజల్లో వ్యతిరేకతను ఎదుర్కొంది. అభివృద్ధి వేగంగా జరగడం లేదన్న విమర్శలు, పెట్టుబడులు తగ్గిన పరిస్థితి, న్యాయస్థానాల్లో కేసులు - ఇవన్నీ ఇబ్బందులు తెచ్చాయి. వైసీపీ సర్కారు మారడానికి ఈ రాజధానుల గొడవ కూడా ఓ కారణం. ఇపుడు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటన రాజకీయంగా స్పష్టమైన సంకేతం. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా వెళ్లాలనే ప్రయత్నం ఇది. రాజధానిపై ఉన్న అనిశ్చితిని తొలగించి పెట్టుబడిదారులకు నమ్మకం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తూ ప్రణాళికలను ఆచరణలో పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో అమరావతి రూపం మారిపోతోంది. ప్రజలలో నమ్మకాన్ని పెంపొందించుకోవడం కోసం బాబు బాటలోనే.. పయనించాలని వైసీపీ నిర్ణయించడం మంచి నిర్ణయం

సూపర్ సిక్స్ హామీలు ఏడాదిన్నరలో అమలుచేశామంటూ సూపర్ హిట్ సభను ఏపీ కూటమి సర్కార్ అనంతపురంవేదికగా నిర్వహించింది. సూపర్ సిక్స్ హామీలు - రైతులకు ఆర్థిక భద్రత, మహిళలకు ప్రత్యేక పథకాలు, విద్యుత్ సాయం, యువతకు ఉపాధి అవకాశాలు ఇవన్నీ ప్రజల్లో మంచి స్పందన పొందుతున్నాయి. పథకాలు సరైన అమలు జరిగితే ఇది సూపర్ హిట్టే . లేదంటే ఇది కేవలం ఎన్నికల హామీగానే మిగిలిపోతుంది. ఏపీ ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఉచిత బస్సుప్రయాణ పథకం విజయవంతం కాగా, ఆటోడ్రైవర్లకు దసరాకానుకగా రూ.15వేల ఎకౌంట్లలో వేయనున్నారు.

మోదీ నాయకత్వంపై ఉన్న ప్రజాదరణను చంద్రబాబు వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటున్నారు. ఆయన ప్రత్యర్థి పార్టీలలో గందరగోళాన్ని పెంచడం, తన పార్టీకి జాతీయ స్థాయిలో ప్రాధాన్యం కల్పించుకునేలా పరిస్థితిని మార్చడం లక్ష్యంగా కనిపిస్తోంది. కేంద్రంతో సమన్వయం పెంచుకుని రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు అందేలా చేయడడంలో దూసుకుపోతున్నారు. మోదీని మూడోసారి ప్రధానిగా నిలబెట్టిన నేతగా చంద్రబాబుకు జాతీయస్థాయిలో ఇమేజ్ పెరిగింది. జాతీయ రాజకీయాల్లో చంద్రబాబు మళ్లీ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. అభివృద్ధి అజెండాను ముందుకు తేవడం, మోదీకి మద్దతుగా మాట్లాడడం, రాష్ట్రానికి నిధులు అందించడంపై చురుకైన చర్యలు ఇవన్నీ కలిసి ఆయనపై ఉన్న 'అనుభవజ్ఞుడైన నాయకుడు' అనే ఇమేజ్‌ను బలోపేతం చేస్తున్నాయి. సోషల్ మీడియాలోనూ ఆయన పేరు ట్రెండ్ అవుతోంది.

జూబ్లిహిల్స్ బైపోల్ ప్రధాన రాజకీయపక్షాలకు కీలకంగా మారింది. పట్టణ మధ్యతరగతి, యువత, వ్యాపార వర్గాలు ఓటింగ్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇది బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ సీటు కాగా, ఇది నిలుపుకోవడం ఆ పార్టీకి పెద్ద సవాల్. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన తొలి ఉపఎన్నిక కంటోన్మెంట్ లో బీఆర్ఎస్ సీటులో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇపుడు రెండోసీటు ఖాళీకాగా అదే మ్యాజిక్ రిపీట్ అవుతుందని అధికారపక్షం ధీమాగా ఉంది. మైనారిటీలు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. ఇపుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లిహిల్స్ గెలుపు కోసం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ కే ఎక్కువ అవకాశాలున్నాయి. ఇక్కడ సామాజిక సమీకరణాల రీత్యా బీజేపీకి పెద్ద స్కోప్ కనిపించడం లేదు.

రైతులకు అవసరమైన యూరియా సరఫరాలో ఆలస్యం, సరైన ప్రణాళికల లోపం కారణంగా సమస్య తీవ్రంగా ఉంది. అధికారయంత్రాంగానికి ముందుచూపు లేకపోవడంతో ప్రభుత్వానికి ఈ సమస్య తలనొప్పిగా మారింది. గత ఏడాదికన్నా ఇప్పటికే యూరియా అధికంగా సరఫరా జరిగినా, సరైన ప్రణాళికలు లేకపోవడం.. రైతులకు అవగాహన కలిగించడంలో విఫలం కావడంతో ప్రతీ చోటా భారీ క్యూలైన్లు కనబడుతున్నాయి. ఈ ఏడాది ఆయకట్టు కూడా గణనీయంగా పెరిగింది. కాలం బాగుంది.. రైతులు సాగుకు సిద్ధమైన పరిస్థితుల్లో వ్యవసాయశాఖ కార్యాచరణ లోపం సర్కారుకు శాపంగా మారుతోంది. సమస్యను ఆలస్యంగా గుర్తించగా, గుర్తించిన తర్వాత చక్కదిదందడంలోనూ తడబాటు కనిపిస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు రిపీట్ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారయంత్రాంగంపై ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుస సమీక్షలతో కేంద్రం నుండి నిధులు సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు. ట్రిపుల్ ఆర్, రీజినల్ రింగ్ రైలు, నూతన హైవేలు సాకారమైతే.. హైదరాబాద్ భవిష్యత్తు రూపం మారిపోతుంది.


## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# సోషల్ మీడియాని షేక్ చేస్తున్న నానో బనానా

## ఎక్కడ చూసినా.. అదే హవా







**మహా నెట్ వర్క్**

ఇపుడు ఎక్కడ చూసినా నానో బనానా.. మోత మోగిపోతోంది. నానో బనానా సోషల్ మీడియాను ఊపు ఊపేస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఏఐ టూల్స్ పుట్టుకొస్తున్నాయి. అటువంటి వాటిలో "నానో బనానా" ఒకటి. ఈ ఫొటో ఎడిటింగ్ టూల్ ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా వినియోగదారులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. నెట్టింట ఎక్కడ చూసినా ఈ టూల్ సహాయంతో క్రియేట్ చేసిన ఇమేజ్‌లే దర్శనమిస్తున్నాయి. నానో బనానా అనేది ఒక ఫొటో ఎడిటింగ్ టూల్. ఇది జెమినీ యాప్ లో ఫొటో ఎడిటింగ్ టూల్ అప్డేటెడ్ వెర్షన్. అయితే 'నానో బనానా' అనేది ఈ కొత్త టూల్ పేరు కాదు. ఇది జస్ట్ కోడ్ నేమ్ మాత్రమే. దీన్ని ఇటీవలే గూగుల్ రివీల్ చేసిన "జెమిని 2.5 ఫ్లాష్ ఇమేజ్ మోడల్" ఆధారంగా రూపొందించారు.

**జెమిని ట్రెండ్ సెట్టర్**

ఇది ఫొటో ఎడిటింగ్, ఇమేజ్ జనరేషన్‌లో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు కనిపిస్తోంది. దీని సహాయంతో ఫొటోలను మనకు నచ్చినట్లుగా కేవలం ఒకటి లేదా రెండు సెకన్లలోనే ఎడిటింగ్‌ను చేయొచ్చు. ఉదాహరణకు దీనిలో మీరు ఒక వ్యక్తి ఫొటోను అప్‌లోడ్ చేసి '3డి ఇమేజ్' అనే ప్రాంప్ట్ ఇస్తే చాలు.. వెంటనే అది ఆకర్షణీయమైన ఫొటోలను క్రియేట్ చేసి అందిస్తుంది. దీంతో ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెమినిఏఐ టూల్ ట్రెండ్ అవుతోంది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ పోస్ట్‌తో ఈ ట్రెండ్ ఊపందుకుంది. ఆయన తన 3డి ఇమేజ్‌ను ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ "ఎక్స్"లో షేర్ చేయడం ద్వారా యువతరంతో కనెక్ట్ అవ్వడానికి ప్రయత్నించారు. ఆ తర్వాత ఈ ట్రెండ్ బాలీవుడ్‌లో కూడా పాపులర్ అయింది. సెలబ్రిటీలు మాత్రమే కాదు.. సామాన్యులు కూడా తమతో పాటు తమ పెంపుడు కుక్కలనూ సూపర్ హీరోలుగా చిత్రీకరించుకున్న ఫొటోలను షేర్ చేస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్, ఎక్స్ లో ఇవే పోస్టులు దర్శనమిస్తున్నాయి. ఈ టూల్‌ను ప్రారంభించిన వారానికే కొత్తగా 10 మిలియన్ల వినియోగదారులు "గూగుల్ జెమిని" యాప్‌ను ఉపయోగించారు. 200 మిలియన్ల చిత్రాలను ఎడిటింగ్ చేశారు.



## రాబోయే 2027 గోదావరి పుష్కరాలకు సర్వం సిద్ధం చేయాలి

**కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**చెన్నూర్ / మంచిర్యాల, మహా :** రాబోయే 2027 గోదావరి పుష్కరాలకు సర్వం సిద్ధం చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శనివారం చెన్నూరు గోదావరి నది తీరంలో గాట్లను మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ , స్థానిక ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ ఇతర శాఖల అధికారులు, పురోహితులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2027 సంవత్సరంలో జరగబోయే గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. భక్తులకు అవసరమయ్యే పార్కింగ్ స్థలాలు, దుకాణాల స్టాళ్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు అవసరమైన ప్రణాళికను తక్షణమే సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈసారి పుష్కరాలకు పది లక్షల మంది భక్తులు పుణ్యస్థానాలు ఆచరించే విధంగా అంచనా వ్యయం రూపొందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఇంద్రమ్మ ఇండ్ల పేరిట ఇసుక అక్రమ రవాణా

**జైనూర్ మహా :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అధికారులు ఇసుకకోసం అను మతి ఇవ్వడంతో కొందరు ఇందిరమ్మ ఇల్లు. కాకుండానే ప్రైవేట్ లో విక్రయించడానికి ఇందిరమ్మ ఇండ్ల పేరిట అక్రమ ఇసుక దందా నడుస్తోంది. గతంలో కూడా అసిఫాబాద్ నుండి జైనూర్ వరకు ఇసుక విక్రయ దారులు తమ ట్రాక్టర్లలో ప్రభుత్వానికి పనులు చెల్లించకుండా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమ ఇసుక దందా చేస్తూ పట్టుబడ్డారు. మళ్లీ తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అనుమతులు ఇవ్వాలని అధికారులకు ప్రజా ప్రతినిధులు కోరడంతో ఇదే సందుగా ఇసుక విక్రయదారులు ఇసుకకు ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా నేరుగా ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక తరలిస్తూ అక్రమ దండ చేస్తున్నట్లు తెలు స్తోంది. దీంతో అటవీశాఖ రెవెన్యూ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించకపో వడంతో ఇసుక విక్రయ దందా దారులు అక్రమంగా ఇసుక తరలిస్తూ దందా చేస్తున్నట్టు తెలుస్తుంది. దీంతో ప్రభుత్వానికి పన్నులు చెలించకుండా ఎగనామం పెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా ఇసుక దందా




చేయ కుండా నిబంధనల ప్రకారం గా అధికారులు పర్యవేక్షణ చేసి అక్రమ దందాకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు. పర్యవేక్షణసరిగా చేయకపోవడంలో అంతర్యం ఏమిటి గతంలో ఇసుకదారులు అక్రమ దందా చేస్తూ రాత్రివేళ తీసు కొని ట్రాక్టర్ల ద్వారా తరలించేవారు ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల పేరట రాత్రి పగలు ఇసుక తరలిస్తూ అక్రమ దందా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడంలో అంతర్యమేంటని విమర్శలు వస్తున్నాయి. ఇసుక దందా దారులు ప్రజా ప్రతినిధులకు అధికారులకు మామూళ్లు మాట్లాడుకుని అక్రమ దందా చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. రాత్రివేళ కాకుండా పట్టపగలు కట్టల ద్వారా ఇసుకను తరలించడంతో చాలామంది అను మానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షణ చేసి ఆక్రమ ఇసుక దందాకు అడ్డుకట్ట వేయాలని చాలామంది ప్రజలు కోరుతున్నారు.

## 500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో హైడ్రాధికారులు కూల్చివేతలు

**ప్రభుత్వ భూములుగా బోర్డులు ఏర్పాటు**

**భూమి చుట్టూ ఫెన్సింగ్**



**రాజేంద్రనగర్ మహా;** ప్రభుత్వ భూముల పరిరక్షణ ఈ బాధ్యతను హైడ్రాకు అప్పగించిన ప్రభుత్వం, నగరంతో పాటు చుట్టుపక్కల ప్రభుత్వ భూముల కోసం జల్లెడ పడుతుంది. హైడ్రా తాజాగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 500 కోట్ల రూపాయల విలువైన 12 ఎకరాల భూమిని శనివారం హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలటీ పరిధిలోని శాతంరాయ్ గ్రామంలోని సర్వే నంబర్ 17లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని హైడ్రాధికారులు విముక్తి కల్పించారు. చుట్టూ నిర్మించిన ప్రహరీతో పాటు లోపల ఉన్న షెడ్డులను జెసిబి సాయంతో తొలగించారు.

**ఇంటర్ బోర్డుకు కేటాయించిన భూమి స్వాధీనం.**

ఈ భూమిని రాష్ట ప్రభుత్వం 2011 లో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ భూమి తమదంటూ స్థానిక నాయకులుగా చెలామణి అవుతున్న ఓ నాయకుడితో పాటు అనీష్ కన్స్ట్రక్షన్స్ అనే సంస్థ క్లెయిమ్ చేస్తోంది. ఈ మేరకు అక్కడ అనీష్ కన్స్ట్రక్షన్ సంస్థ బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించడంతో స్థానికులు హైడ్రాకు సమాచారం అందించారు. రాళ్ళుతో కూడిన భూమిలో వ్యవసాయ వినియోగానికి అవకాశంలేని ఈ ప్రభుత్వ భూమిలో వ్యవసాయం చేస్తున్నామంటూ.. అసఫ్ జాహీ పైగా కుటుంబ వారసుల నుంచి కొన్నామంటూ కబ్జాదారులు చెబుతున్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేసారు. స్థానికులతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు యిచ్చిన ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగి స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూములు నిర్మాణాలను కూల్చివేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

## నకిలీ పత్రాలను సృష్టించి షూరిటీలు తయారు చేసిన వ్యక్తుల అరెస్టు

**ఆదిలాబాద్ మహా :** ఫోర్జరీ సంతకాలతో నకిలీ ష్యూరిటీలు తయారు చేసిన కేసులో 8 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నకిలీ షూరిటీలో ప్రభుత్వ అధికారి సంతకాలు ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లను సృష్టించి వాటిని నిజమైనవనిగా కోర్టులో సబ్మిట్ చేశారని, వీటిని ఉపయోగించిన, లబ్ధి పొందిన, మధ్యవర్తిత్వం వహించిన 17 మంది పై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. స్థానిక పోలీస్ ఏ.ఆర్ హెడ్ క్వార్టర్స్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని కేసు వివరాలను వెల్లడించారు. నకిలీ డాక్యుమెంట్లతో కోర్టును సైతం నిందితులు మోసం చేశారని తెలిపారు. నకిలీ షూరిటీ లను ఉపయోగించి కోర్టు ద్వారా కొందరు నిందితులకు బెయిల్ మంజూరు చేయడంతో పాటు... వాహనాలు, సెల్ ఫోన్ల రిలీజ్ కోసం వాడుకున్నారని పేర్కొన్నారు. ఇందులో ప్రధాన నిందితుడైన తలమడుగు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కాటిపెల్లి అభిలాష్ రెడ్డితో పాటు మరో ఏడుగురిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. కోత్తూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరవేని రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కారోబార్ గా పని చేస్తున్న అభిలాష్ రెడ్డి, మధ్యవర్తి సయ్యద్ ఇర్ఫాన్ లు పంచాయతీ కార్యదర్శి సంతకాలను నకిలీగా సృష్టించారన్నారు. నకిలీ గృహ విలువ పత్రాలు, పన్ను రసీదులు తయారు చేసి కోర్టులో నేరస్తులకు బెయిల్ కోసం, కోర్టు నుండి జప్తు




చేయబడిన ప్రాపర్టీల రిలీజ్ కోసం షూరిటీ పత్రాలుగా సమర్పించినట్లు తేలిందని పేర్కొన్నారు. గంటి సత్తెన్న, మద్దెల అశోక్ ల పేర్లను ఉపయోగించి న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారన్నారు. ప్రభుత్వ పత్రాలను నకిలీ చేయడం, కోర్టును తప్పుదారి పట్టించే చర్యలు తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని స్పష్టం చేశారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే వారెవరైనా కఠినమైన శిక్షలకు గురవుతారని స్పష్టం చేశారు. పెద్ద పెద్ద నేరాలు చేసే వారికి, మధ్యవర్తుల ద్వారా వచ్చే వారికి ప్రభుత్వ ఉద్యోగులు షూరిటీలు ఇచ్చి మోసపోకుండా ఉండాలని సూచించారు. షూరిటీ ఇచ్చిన నిందితులు పారిపోతే ఉద్యోగుల నుండి డబ్బులను, ఆస్తిపత్రాలను జప్తు చేయబడుతుందని, కట్టని పక్షంలో ఆస్తుల స్వాధీనంలేదా చట్టపరమైన చర్యలుంటాయని తెలిపారు.



## నిత్యాన్నదాన కేంద్రాన్ని సందర్శించిన కంది కిష్టారెడ్డి

**ఆదిలాబాద్ మహా :** కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజా సేవాభవన్ లో గత మూడున్నరేళ్ళుగా నిరంతరాయంగా కొనసాగుతున్న నిత్యాన్న దాన కేంద్రాన్ని కంది శ్రీనివాస రెడ్డి తండ్రి కంది కిష్టా రెడ్డి శనివారం సందర్శించారు. కేంద్రానికి ఆకలి తీర్చుకోవడానికి వచ్చిన అందరికి నమస్కరిస్తూ ఆప్యాయంగా పలకరించారు. ఎలా ఉన్నారంటూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. వచ్చిన వారికి ఆయన స్వయంగా వడ్డన చేస్తూ కడుపు నిండా భోజనం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సందా నర్సింగ్, అల్చట్టి నాగన్న, శ్రవణ్ నాయక్, రాంరెడ్డి , ఖయ్యూం , ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మావోయిస్టులతో చర్చలు జరపాలి

**తెలంగాణ సిపిఐ కంట్రోల్ కమిషన్ రాష్ట్రకార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి**



**బెల్లంపల్లి, మహా:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల వార్షికోత్సవాల సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని తెలంగాణ కంట్రోల్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి డిమాండ్ చేశారు.శనివారం రోజు తెలంగాణ రైతంగా సాయుధ పోరాట యోధుల వార్షికోత్సాల సందర్భంగా నెంబర్ టు ఇంక్లైన్ రడగంబాల బస్తిలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసంగిస్తూ తెలంగాణ రైతన్న సాయుధ పోరాట యోధులు స్మరిస్తూ వారి ఆశయ సాధన కోసం పురంకితం కావలసిన బాధ్యతను కమ్యూనిస్టు పార్టీ ప్రజాసంఘాలు మరింత ధృడ సంకల్పంతో పోరాడాలని కోరారు . కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు తక్షణమే జరపాలని, భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా క్రిమినల్నాన్ ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా బూటకపు ఎదురుకాల్పుల పేరుతో జరుగుతున్న నరమేధాన్ని తక్షణమే ఆపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.ప్రాపంచిక కార్మిక వర్గ దృక్పథం అర్థం చేసుకొని నరేంద్రమోడీ నరాంతక పాలన వ్యతిరేకిస్తూ భారత రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్టులతో హిందూ రాజ్యాన్ని స్థాపించాలని జరుగుతున్న తెరవెనుక నాటకాలను హిందూ పాసిజర్ ని ఓడించాలంటే దేశంలో ఉన్న అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. మావోయిస్టు పార్టీ కూడా ప్రజాసామిక పోరాటాలకు కలిసి రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, పట్టణ పార్టీ కార్యదర్శి ఆడెపు రాజమౌళి ,తెలంగాణ రైతన్న సాయుధ పోరాట యోధులకు నివాళులు అర్పించారు.




## రాజీ మార్గంతో కేసుల సత్వర పరిష్కారం

**ఆదిలాబాద్ మహా :** రాజీ మార్గం ద్వార కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు అన్నారు. శనివారం జిల్లా కోర్ట్ ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీపడదగ్గ కేసులను పరిష్కరించి కక్షిదారులకు సంబంధిత పత్రాలను అందించారు. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు మాట్లాడుతూ.... ప్రతి మూడు నెలలకు ఒక సారి నిర్వహించే లోక్ అదాలత్ లో రాజీ మార్గం ద్వార కేసులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో అత్యధిక కేసులను పరిష్కరించగలుగుతున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరామ్ ప్రసాద్, కుమార్ వివేక్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాజ్యలక్ష్మి ,డీఎస్పీ జీవన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## తమ ప్రాణాలను కాపాడుకో నీకే ప్రతిదాడి యత్నించాం

**దమ్మన్నపేటలో యుద్ధ వాతావరణం**

**మీడియా ప్రతినిధినిధుల నిరసన**

**దండేపల్లి / మంచిర్యాల, మహా :** తమ ప్రాణాలను కాపాడుకోనీకే ప్రతిదాడికి యత్నించామని దమ్మన్నపేట గిరిజనులు స్పష్టం చేశారు. దండపల్లి మండలంలోని లింగాపూర్ 360 కంపార్ట్మెంట్లోని ఫారెస్ట్ భూమిని కొత్త మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని దమ్మన్నపేట గిరిజనులు ఆక్రమించుకొని పోడు వ్యవసాయం చేస్తుండగా శనివారం ఒకవైపు గిరిజనులు 200 మంది ఫారెస్ట్ అధికారుల మధ్య ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఫారెస్ట్ అధికారులు దాదాపు 200 మంది పైగా సిబ్బంది అక్కడికి చేరుకోవడంతో ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది. స్థానిక గ్రామస్తుల సైతం ఏం జరుగుతుందో అని భయాందోళనకు గురయ్యారు. పోడు వ్యవసాయం చేస్తున్న మహిళా గిరిజనులు సమీపంలోని వాగులో స్నానం చేస్తుండగా కొంతమంది ఫారెస్ట్ సిబ్బంది తమతో అసభ్యంగా ప్రవర్తించి దాడులకు దిగారని వారు ఆరోపించారు. దీనికి ప్రతిదాడిగా తమ మాన




ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రతిదాడి చేయాల్సి వచ్చిందని తమ ఉద్దేశపూర్వకంగా దాడి చేయలేదని వారు వెల్లడిస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు తమను మహిళలని చూడకుండా నీచంగా వ్యవహరిస్తున్నారని తమ గూడును పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఫారెస్ట్ సిబ్బందిపై దాడికి పాల్పడిన 14 మంది మహిళలను పోలీసులు బందోబస్తు మధ్య అరెస్టు చేసి దండేపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. మీడియా కవరేజ్ కోసం వచ్చిన ప్రతినిధులను లోపలకు అనుమతించకపోవడంతో ఫారెస్ట్ అధికారుల వైఖరిని నిరసిస్తూ జర్నలిస్టులు అక్కడే ఉన్న రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. జన్నారం ఫారెస్ట్ డివిజనల్ అధికారి ఘటన స్థలానికి వచ్చి ఇరుపక్షాల ఘర్షణకు దారి తీసిన విషయాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**అధ్యక్షులు నిరటి మల్లేష్**

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండల కార్యాలయ ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల మధ్యాహ్న భోజన కార్మికులు రెండవసారి మండల మహాసభ నిర్వహించారు. సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సిఐటియు జిల్లా నాయకులు నీరటి మల్లేష్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలి. కనీస వేతనం 18000 వేలు ఇవ్వాలి, ఈఎస్ఐ పిఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెండవసారి మండల కమిటీని ఎన్నుకోన్నారు.



గౌరవ అధ్యక్షులు నీరటి మల్లేష్, రెండవసారి ఎన్నికైన అధ్యక్షులు డబ్బి కార్ గణేష్, ఉపాధ్యక్షులు సుధాకర్ సరిత, జనరల్ సెక్రెటరీ లావణ్య, సహాయ కార్యదర్శి సావిత్రి, కమలమ్మ, రవీందర్, రామలక్ష్మి, కోశాధికారి లక్ష్మీదేవ కమిటీ సభ్యులు మల్లమ్మ పెద్ద గోల్కొండ,కల్పన శాతం రాయి ,నర్సింగ్ రావు ఎయిర్పోర్ట్ కాలనీ, లావణ్య తొండపల్లి, శివరాణి చిన్న గోల్కొండ, యాదమ్మ తొండుపల్లి,రజిత బోటి గూడ పాల్గొన్నారు.



## విజయవంతమైన జర్నలిస్టుల హెల్త్ క్యాంప్

**సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**ఆమనగల్లు, మహా:** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పాత్రికేయులకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పాత్రికేయులు పేర్కొన్నారు. శనివారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆమనగల్లులో నాలుగు మండలాల జర్నలిస్టుల కుటుంబాలకు ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న జర్నలిస్టుల కుటుంబాలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చి ఆర్గానిక్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో జర్నలిస్టులు ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎటువంటి నేపథ్యంలో వృత్తిపరంగానే కాకుండా ఆరోగ్యపరంగా కూడా వైద్య సేవలు చేయించు కోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం విధి నిర్వహణలో బిజీగా ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలకు సమాచారం అందించడంలో ఎదుర్కొనే కష్టాలు, కృషి వల్ల జర్నలిస్టులు ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టడం లేదని, వారు ఆరోగ్యంగా ఉండడం ప్రజలకు ఎంతో అవసరం అన్నారు. జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని పేర్కొన్నారు.



## పేదలకు గొడుగులు పంపిణీ చేసిన కంది కిష్టారెడ్డి

**ఆదిలాబాద్ మహా :** సామజిక సేవలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా పాలు పంచుకుంటున్నారు. తమకు తోచిన రీతిలో సాయం చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారు. వర్షాకాలం నేపథ్యం లో శనివారం ఆదిలాబాద్ పట్టణం లోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ఆవరణలో పేదలకు గొడుగులు పంపిణి చేసి తమ ఔదర్యాన్ని చాటు కున్నారు. ముమ్ముందు కూడా ఇదే రకమైన సేవలను కొనసాగిస్తామన్నారు. ఈకార్యక్రమంలో గిమ్మ సంతోష్ రావు, సందా నర్సింగ్, అల్చట్టి నాగన్న, శ్రవణ్ నాయక్, రాంరెడ్డి , ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ఆమనగల్లు, మహా :** మాడుగుల మండలం గిరికొత్తపల్లి నుంచి శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకొని సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్ ఎరుకొని శివ కేసు నమోదు చేసినట్లు సీఐ వేణు గోపాల్ రావు చెప్పారు.పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఇసుకతో వస్తున్న ట్రాక్టర్ పట్టుకున్నట్లు వివరించారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.




## ఇబ్రహీంపట్నం చేరుకున్న భరోసా బస్సు యాత్ర

**రంగారెడ్డి జిల్లా మహా:** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చేపట్టిన భరోసా బస్సు యాత్ర శనివారం ఇబ్రహీంపట్నం చేరుకుంది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, పిలుపు మేరకు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు 250 గజాల ప్లాటు, పింఛను, గుర్తింపు కార్డు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ, తెలంగాణ లో ఉన్న 584 మండలాలలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టియుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, భరోసా బస్సు యాత్ర చేపట్టడం జరిగింది. బస్సు యాత్ర ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా స్థానిక ఉద్యమకారులైన డబ్బుకారి





శ్రీనివాస్, బోసుపల్లి వీరేష్ కుమార్ ఘనంగా ఉద్యమకారులకు స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఉద్యమకారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యమంలో పాల్గొన్న నాయకులను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని వారు తెలిపారు.

## నిర్మాణ రంగాన్ని బలపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది: మంత్రి శ్రీధర్ బాబు..

**రాజేంద్రనగర్ మహా ;** ప్రపంచంలో అతిపెద్ద వ్యాపార నెట్వర్కింగ్, వ్యాపార రిఫరల్ సంస్థ బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) ఆధ్వర్యంలో శంషాబాద్ ఎస్ఎస్ కన్వెన్షన్లో బీఎన్ఐ వాంటేజ్ గోనాట్ 2025 పేరుతో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ఫోర్డ్ పరిశ్రమల ఎక్స్పోను , వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్ బాబు శనివారం ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద ఎంఎస్ఎంఈ ఎక్స్పో, సెమినార్ ఈ కార్యక్రమాన్ని బీఎన్ఐ హైదరాబాద్ నిర్వహిస్తోంది. రెండు రోజులు పాటు జరిగే ఈ ఈవెంట్ పారిశ్రామికవేత్తలు, పరిశ్రమ నాయకులు, వ్యాపార దృక్పథం కలిగిన వ్యక్తులను ఒకే వేదికపై చేర్చింది. ఇప్పుడు ఐదో ఎడిషన్లోకి ప్రవేశించింది. హైదరాబాద్లో బీఎన్ఐ 13 ఏళ్ల సేవా ప్రయాణాన్ని సూచిస్తు ఈ గోనాట్ 2025కు భారత్, మధ్య ప్రాచ్య దేశాలు, పొరుగు దేశాల నుంచి ఇరవై వేలకు పైగా సందర్శకులు రానున్నారు. 200 పైగా ఎంఎస్ఎంఈలు తమ విభిన్న ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తూ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద బీఎన్ఐ రీజియన్ గా నిలిచిన బీఎన్ఐ హైదరాబాద్, 400 పైగా పరిశ్రమల్లో 4,000 పైగా వ్యాపార యజమానులను కలిగి సంస్థ, మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ భవిష్యత్తు, దేశ నిర్మాణంలో వాటి పాత్ర, ఈ రంగాన్ని బలపరచేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై డైనమిక్ ఫైర్ సైడ్ చాట్ రీజియన్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ ఇది కేవలం ఒక ఎక్స్పో మాత్రమే కాదన్నారు. ఇది సహకారాలకు జన్మనిచ్చే, ఆలోచనలకు రెక్కలు విప్పే ఎకోసిస్టం అన్నారు. ఈ వేదిక వందల వేల ఎంఎస్ఎంఈలు తమ సామర్థ్యాలను ప్రదర్శించడానికి, తమ పరిధిని విస్తరించడానికి సహాయపడిందని తెలిపారు. బీఎన్ఐ వంటేజ్ గోనాట్ 2025కి శ్రీ ఆదిత్య వాంటేజ్ రీగల్ రెసిడెన్సెస్ టైటిల్ స్పాన్సర్గా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమానికి కోస్పాన్సర్లు ఓపీపీఈఐఎన్, పోకర్ణా లిమిటెడ్, లియో పాకర్స్ & మూవర్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ స్పాన్సర్గా ఉన్నారు.



## కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

**ఆమనగల్లు, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నుశనివారం ఆయన నివాసంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నాయకులు మర్యాదపూర్వకంగాకలిశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల పైచర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విజితరెడ్డి, నాయకుడు అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సొమ్ముతో బల్దియా స్టడీ టూర్




**వరంగల్ మహా;** పదవీకాలం ఆరు నెలలు కూడా లేని సమయంలో ప్రజల సొమ్ముతో స్టడీ టూర్ పేరిట దుబారా ఖర్చుకు శ్రీకారం చుట్టింది బల్దియా. అసలే అకాల వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఇవేమి పట్టించుకోకుండా స్టడీ టూర్ పేరు మీద ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడం సరి కాదని ప్రతిపక్షాలతో పాటు సామాజికవేత్తలు అంటున్న మాట.! కొన్ని ప్రజా సంఘాలు ఇది స్టడీ టూర్ కాదని విహారయాత్ర అని ఎద్దేవా కూడా చేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే వరంగల్ మహా నగరపాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కార్పొరేటర్లు, అధికారులు మధ్యప్ర దేశ్ రాష్ట్రంలోని ఇండోర్ తో పాటు రాజస్తాన్ రాష్ట్రంలోని జైపూర్ లో జరిగే స్టడీ టూరు కు సిద్ధమయ్యారు. ఈ నెల 14 (ఆదివారం) నుంచి 19 వరకు ఆరు రోజుల పాటు టూర్ లో భాగంగా జైపూర్ లో పర్యటించ నున్నారు. ఇందుకు పూర్తి ఖర్చులు స్మార్ట్ సిటీ నిధుల నుంచి ఖర్చు చేస్తారని తెలుస్తోంది. ఈ స్టడీ టూర్ గురించి పూర్తిస్థాయిలో వివరణ కోరితే స్మార్ట్ సిటీ ప్రతినిధులు నోరు మెదపడం లేదు.. బహుశా బల్దియా పెద్దల ఆదేశాలు కాబోలు. ఇక దేశంలో అత్యంత పరిశుభ్రమైన నగరంగా ఇండోర్ గుర్తింపు పొందింది. ఈ టూర్లో భాగంగా కార్పొరేటర్లు, అధికారులు అక్కడ చెత్త నిర్వహణ, శుభ్రత విధానం, నగర సుందరీకరణ, ఎంక్రోచ్మెంట్, ఐసీసీసీ, రెవెన్యూ జనరేషన్, పార్క్ ల నిర్వహణ, డీఆర్ఎఫ్ పని విధానం, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మెంటెనెన్స్ వంటి వాటిపై అధ్యయనం చేస్తారని ఓ అధికారి ద్వారా తెలిసింది. నగర మేయర్ గుండు సుధారాణితో పాటు 55 మంది. కార్పొరేటర్లు, 25 మంది గ్రేటర్ అధికారులు టూర్ కు వెళ్తుతున్నారు. కాగా అదనంగా కొందరు మహిళా కార్పొరేటర్ల భర్తలు, వారి సహాయకులు, ఇతర వ్యక్తులతో సహా మరో 40 మంది కూడా వెళ్తుండడం గమనార్హం. వీరికి ఒక్కొక్కరికి సుమారు రూ.30 నుంచి రూ. 40 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. మిగిలిన అనధికార ఖర్చులు ఎవరికి వారే భరిస్తారా అన్నది ప్రశ్నే. ఈ టూర్ పై మొత్తానికి సుమారు రూ.30 నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. స్టడీ టూర్లో భాగంగా ఇండోర్ తో పాటు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూ ర్లో కూడా ఒక రోజు పర్యటిస్తారు. అక్కడి సుందరీకరణ, పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి సారిస్తారు.

**టూర్ పై విమర్శలు.. వివాదాలు..**

నగరంలో 66 మంది కార్పొరేటర్లు పని చేస్తుండగా ఇందులో 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు మృతి చెందగా మరో 9 మంది స్టడీ టూర్ కు వెళ్లకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వారిలో ప్రతిపక్షం తో పాటు అధికార పార్టీ కార్పొరేటర్లు కూడా ఉండడం మరో విశేషం. కొందరు పాలక వర్గం పెద్దల పని తీరు నచ్చక, మరి కొందరు వ్యక్తిగత కారణాల వల్ల గైర్హాజరు అవుతున్నట్లు ప్రచారం జోరుగా జరుగుతోంది. అయితే మేయర్, కార్పొరేటర్ల పదవీకాలం మరో ఏడు మాసాలు మాత్రమే ఉన్నందున అక్కడే కార్పొరేటర్లకు పాలక వర్గం ప్యాకేజీలు అందిస్తారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష కార్పొరేటర్లు ఇది స్టడీ టూర్ కాదని విహారయాత్ర పేరుతో ప్రజాధనాన్ని దుబారా చేయడమేంటని మండిపడుతున్నారు. ఇంకా ఈ టూర్ లో శాఖకు సంబంధం లేని వ్యక్తులను తీసుకెళ్లడం, స్మాట్ సిటీ పనుల గడువు ముగిసినా స్మాట్ సిటీ నిధులు టూర్ కు ఖర్చు చేయడం వంటి అంశాలు వివాదాస్పద మవుతున్నాయి.

## బ్రతికి ఉన్న వ్యక్తిని రికార్డుల్లో
# చంపేసిన అధికారులు
### నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన లద్దునూరి రమేష్




**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల ఆఫీస్ లో గత రెండు నెలలుగా ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ లద్దునూరి రమేష్ వారి తల్లి లద్దునూరు సూరమ్మ రమేష్ చనిపోయినట్టు తప్పుడు ధృవపత్రాలు ఇచ్చారనే అంశం ప్రచార మాధ్యమాలలో చక్కర్లు కొడుతోంది.

**వివరాల్లోకి వెళితే..**

లద్దలూరు సూరమ్మ భర్త కీ శే రాజయ్య వారి రెండో కుమారుడు లద్దులూరి యుగంధర్ తండ్రి రాజయ్య వీరి పేరు మీద ఉన్న ఎకరం 10 గుంటల పొలం కాజేయాలని ఒక పథకం పన్ని నల్లబెల్లి ఎమ్మార్వో తో కుమ్మక్కై ఎకరం 10 గంటల పొలాన్ని కాజేశే క్రమంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరమై నల్లవెల్లి ఎమ్మార్వో ఆఫీస్ లో గిర్దావరి ఆరూరి కార్తీక్ తో మాన్యువల్ పంచనామా చేసి అందులో రాజయ్యకు ముగ్గురు కుమారులు పెద్ద కుమారుడు లద్దునూరి రమేష్ రెండో కుమారుడు లద్దునూరి యుగేందర్ మూడో కుమారుడు లద్దునూరి ప్రశాంత్ కుమారులుగా దాని పంచనామాలు రాస్తూ పెద్ద కుమారుడు చనిపోయినట్టుగా పంచనామాలో రాయించి తప్పుడు ధ్రువపత్రాలతో కీర్తిశేషులు లద్దునూరి రాజయ్య భూమిని వారి భార్య అయిన లద్దు నూరి సూరమ్మ పేరు మీదికి మార్చారు. కాగా ఒక నెలరోజులు కాకముందే లద్దునూరు సూరమ్మ పేరు మీద ఉన్న భూమిని అమ్మ నీకు పింఛన్ ఇప్పిస్తా రా అని సద్దులూరి సూరమ్మకు రెండో కుమారుడైన లద్దునూరి యుగంధర్ ఆప్కారి కానిస్టేబుల్ వారి భార్య ప్రపూర్ణ పేరు మీదికి సేల్ డీడ్ చేసి వారి అమ్మను మోసం చేసి వారి ఆస్తిని కాజేసారు ఈ విషయమై లద్దూరి రమేష్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పోలేపాక రాణి వారి సహాయం తో నేను చనిపోయినానని తెలుసుకొని లద్దులూరి రమేష్ నేను చనిపోకుండానే నేను చనిపోయినట్టు పంచనామాలో రాయించి భూమిని కాజేయడానికి సహకరించిన మండల ఎమ్మార్వో పంచనామా చేసి తప్పుడు రిపోర్ట్ లు ఇచ్చిన వారందరి పైన కేసు నమోదు చేయాలని వారందరినీ సస్పెండ్ చేయమని నల్లబెల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు కు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కు దరఖాస్తు ఇచ్చి నాకు న్యాయం చేయమని లద్దునూరి రమేష్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.



## పేదల సంక్షేమానికి ప్రభుత్వం
# ప్రత్యేక కృషి
### వినతులు స్వీకరించిన రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వరంగల్ మహా;** రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం హనుమకొండ రామ్ నగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి విజ్ఞప్తులను వినతులను స్వీకరించిన కొండా సురేఖ ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని రంగురంగుల బ్రోచర్లలో, వీడియోలో చూపెట్టారని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని కండ్ల ముందే చేసి చూపెడుతుందని మంత్రి సురేఖ తెలిపారు. ప్రతిపక్షాలు వాళ్ల రాజకీయ ఉనికి కోసమే ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నాయని ఇక్కడ జరిగే అభివృద్ధి మాత్రం వాళ్ల కళ్ళకు కనిపించడం లేదని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం చూపడం ప్రజాపాలనకు నిదర్శనం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిచే విధంగా చర్యలు చేపడతామని మంత్రి తెలియజేశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఏ సమస్యలు ఉన్న ప్రజలు నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చునని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ప్రజలకు స్పష్టం చేశారు.

## జిల్లా క్రీడలధికారి అశోక్‌కు
# అభినందనలు తెలిపిన నాయిని
### పోటాపోటీగా చెస్ ఆడిన ఎమ్మెల్యేలు



**హన్మకొండ మహా;** మలేషియాలో జరిగే అంతర్జాతీయ సెమినార్ కు హాజరుకానున్న హనుమకొండ జిల్లా క్రీడలు యువజన అధికారి గుగులోతు అశోక్ కుమార్ ను హనుమకొండ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి శనివారం అభినందించారు. హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివై ఎస్ఓ ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అశోక్ కుమార్ అంతర్జాతీయ సెమినార్ పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో హనుమకొండకు పేరు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**చెస్ ఆడిన ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు**

హనుమకొండ 61వ డివిజన్ ప్రశాంత్ నగర్‌లో శనివారం నాడు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు చెస్ బోర్డు ముందు కూర్చొని ప్రత్యక్షంగా పోటాపోటీగా చెస్ ఆడుతూ, స్థానికులను ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ప్రశాంత్ నగర్ లో నూతన చెస్ క్లబ్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. యువతలో ప్రాచీన మేధస్సు క్రీడ అయిన చెస్ పట్ల ఆసక్తి పెంచేందుకు, వారిలో వ్యూహాత్మక ఆలోచనా శక్తిని అభివృద్ధి చేసేందుకు ఈ క్లబ్ గొప్ప వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ చెస్ అనేది ఒక మేధో క్రీడ. దీనివల్ల మనం నిర్ణయాలను ఎలా తీసుకోవాలో, ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలో నేర్చుకోవచ్చు అని అన్నారు. అలాగే నాగరాజు మాట్లాడుతూ, యువత చెస్ వంటి ఆటలవైపు మొగ్గు చూపితే వారి భవిష్యత్తు దృఢంగా నిర్మాణమవుతుంది అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు,స్థానిక నాయకులు రమాకాంత్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు రమేష్ తో పాటు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, చెస్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి
### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్

**వరంగల్ హన్మకొండ మహా;** జాతీయ లోక్ అదాలత్ లో వివిధ కేసులను పరిష్కరించుటకు జిల్లా వ్యాప్తంగా వరంగల్ జిల్లాలో08 , నర్సపేట02 బెంచీలను ఏర్పాటు జరిగిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్ తెలిపారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా10 బెంచీలను ఏర్పాటు చేసి, మొత్తం5938 పెండింగ్ కేసులను ఇందులో సివిల్ కేసులు26, యమ్.వి.ఓ.పి. కేసులు 24, (రూ.2,15,44,176/),క్రిమినల్ కేసులు 5912, మరియు బ్యాంక్ పి.ఎల్.సి. కేసులు 76,720 (రూ.2,28,82,709/) పరిష్కరించడం జరిగింది. ఈ జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా వినూత్న లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజ్ కుమార్ సుమారు 300 పులిహోర ప్యాకెట్లు కక్షిదారులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నుండి జయశ్రీ, రమాదేవి పాల్గొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగించడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ న్యాయసేవాధికార సంస్థ ద్వారా వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఇరువురు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మెడికల్ బోర్డు నిర్వహించడంలో గుర్తింపు,
# ప్రాతినిధ్య సంఘాలు విఫలం

- 55 మందిలో 5 అన్ఫిట్ పై విమర్శలు
- మెడికల్ బోర్డు కొరకు కార్మిక కుటుంబాలు ఎదురుచూపులు




**మంచిర్యాల, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ బొగ్గు పరిశ్రమలో కార్మికులకు మెడికల్ బోర్డు నిర్వహించడంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటియుసి), ప్రాతినిధ్య సంఘం (ఐ.ఎన్.టి.యు.సి) విఫలం అయ్యాయని కార్మికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఒకవైపు తండ్రి కొడుకుల ఉద్యోగాలు తాము పునరుద్ధరించామని ఒక యూనియన్ అంటుంటే, తాము అందులో పాత్రధారులమని గొప్పలు చెప్పుకొని, జబ్బలు సర్చుకున్న యూనియన్ నాయకులకు ప్రస్తుతం తెల్లముఖమేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తండ్రి కొడుకుల ఉద్యోగాల కల్పన ప్రారంభ సమయంలో నెలకు ఒక ధపా, మెడికల్ బోర్డును నిర్వహిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అవేవి ఇక్కడ కానరావడం లేదు. ఈ సంవత్సరం మార్చిలో జరిగిన సింగరేణి కార్పొరేటు మెడికల్ బోర్డు తర్వాత మరోసారి మెడికల్ బోర్డు జరగకపోవడంపై కార్మిక వర్గం గుర్రుగా ఉంది. అయితే ఇంతకు క్రితం కొంతమందిని మెడికల్ బోర్డులో అన్ఫిట్ చేయకుండా హయ్యర్ రిఫరెన్స్ పేరుతో 9, 10 నెలలుగా పెండింగులో పెట్టి అటు జీతం లేకుండా తీవ్ర నష్టానికి గురిచేసిన యాజమాన్యం ఎట్టకేలకు 55 మందికి సింగరేణి కార్పొరేట్ మెడికల్ బోర్డు కు 31 జూలై 2025 నాడు హాజరు కావలసిందిగా ప్రకటించింది. ఇలా నిర్వహించిన మెడికల్ బోర్డు 55 మందికి గాను కేవలం 5 గురిని మాత్రమే అన్ఫిట్ చేసి, మిగతా వాళ్లలో కొందరికి ఎవరి డ్యూటీలకు వాళ్లు వెళ్లాలని, ఇంకొందరిని సర్ఫేస్ ఉద్యోగాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. మెడికల్ బోర్డు ప్రారంభం నుండి ఎప్పుడూ ఎదురు కానీ ఈ విపత్కర పరిస్థితిని చూసి సామాన్య కార్మికులు తమ వారసులకు ఉద్యోగం వస్తుందో రాదోనని బెంగపడుతున్నారు. ఈ మెడికల్ బోర్డు 55 మందిలో సాలిన పదిమంది కార్మికులు హాజరైతే అందులో ఒకరిని అన్ఫిట్ గా ఎంపిక చేయడం ఏమిటని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత 31 జులై 2025 నాడు నిర్వహించిన మెడికల్ బోర్డుకు 55 మంది హాజరైతే కేవలం 5 గురి అన్ఫిట్ చేయడం అన్యాయమని కార్మికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో 55 మంది బోర్డుకి వెళ్ళగా అందులో ఒకరు గైరాజరు కాగా 32 మందిని సేమ్ టు జాబ్ కు పంపగా మిగిలిన 17 మందిని సింగరేణి కార్పొరేట్ మెడికల్ బోర్డు సర్ఫేస్ విధులకు సిఫార్సు చేసింది. ఈ విషయంపై కొన్ని కార్మిక సంఘాలు బహాటంగానే విమర్శిస్తుండగా, మళ్ళీ మెడికల్ బోర్డును నిర్వహించాలని హెచ్ఎంఎస్ యూనియన్ సైతం డిమాండ్ చేసింది. కార్మికులు వివిధ కారణాల చేత పీడింపబడుతున్నామని పేర్కొంటూ సింగరేణి మెడికల్ బోర్డు కు దరఖాస్తు చేసుకున్నప్పటి నుండి కార్పొరేట్ మెడికల్ బోర్డుకు పిలిచే వరకు కార్మికులు విధులకు గైరాజరవుతున్నట్లు హాజరు పట్టిక గణాంకాలు చెబుతున్నాయి. ఒక్కొక్క కార్మికుడు పది నెలల నుండి సంవత్సరం వరకు విధులకు గైరాజరుగుతున్నట్లు తెలుస్తోంది. సాలిన ఒక నెల జీతం కార్మికునికి లక్ష రూపాయలు వస్తుందంటే 10 నెలలకు 10 లక్షల రూపాయలు కార్మికునికి నష్టం జరిగిందని అర్థమవుతుంది. వీరి లోటును ఎవరు తీరుస్తారో ఎదురుచూడాల్సిందే. గత 5 నెలలుగా సింగరేణి కంపెనీలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకపోవడంపై సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) ప్రాతినిధ్య (ఐ.ఎన్.టి. యు.సి) సంఘాలు విఫలం అయ్యాయని కార్మికులు ధ్వజమెత్తుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ దాని అనుబంధ సంస్థ (ఏఐటీయూసీ) తో పొత్తు పెట్టుకుని విజయం సాధించిన విషయం తెలిసిందే. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. సింగరేణి యాజమాన్యం సీ అండ్ ఎండి చైర్మన్ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయకుంటే ఈ రెండు యూనియన్లు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసే అవకాశం ఉంది. కానీ వీరు ఎందుకు కలవడం లేదో అర్థం కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




## నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి
# చేయడమే నా ధ్యేయం
### మంత్రి కొండా సురేఖ

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం సమగ్ర అభివృద్దే ధ్యేయమని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖామంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం తూర్పు నియోజకవర్గం లోని పలు డివిజన్లలో రూ.3 కోట్ల తో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ముందుగా జిడబ్ల్యూ ఎంసీ పరిధిలోని 21వ డివిజన్ ఎల్ బి నగర్ లో 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డు, డ్రైన్స్ పనులకు, కాశిబుగ్గ లో రూ.150 లక్షలతో నిర్మించే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి, రూ 50 లక్షలతో నిర్మించే సిసి రోడ్ పనులతో పాటు 26వ డివిజన్ గిర్మాజీపేట లో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్లు, డ్రైన్స్ పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం ప్రకాష్, కార్పొరేటర్లు మహ్మద్ పుర్ఖాన్, ఓని స్వర్ణలత భాస్కర్, బాల్నే సురేష్, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్ , బల్దియా ఈఈ సంతోష్‌బాబు, సంబంధిత శాఖల అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షానికి కూలిన ఇల్లు



**మందమర్రి, మహా :** శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మందమర్రి యాపల్ దుబ్బ గూడెం శివకేశవ ఆలయం ముందర గల నడిమెట్ల పోచం అనే నిరుపేద ఇల్లు కూలిపోయిన ఘటన శనివారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం ఇంటి యజమాని పోచం ఒక రోజు క్రితం తన బంధువుల ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. కాగా శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ఇల్లు ఎక్కడికక్కడే కూలిపోయిందని నిర్వహించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణం నష్టం జరగలేదు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలా కాని పక్షంలో పట్టణంలో ఉన్న రెండు పడకల గృహాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ చేస్తున్నారు.



## అయూబ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యేలు

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 21వ డివిజన్ పరిధిలోని శాంతి నగర్ ప్రాంతానికి చెందిన వరంగల్ జిల్లా మైనారిటీ చైర్మన్ మహమ్మద్ అయూబ్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించగా శనివారం అయూబ్ నివాసానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, టీపీసీసీ ఉపాధ్యక్షులు నమిండ్ల శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూరియాపై అనవసర రాద్ధాంతం వద్దు
### కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి




**ఆదిలాబాద్ మహా :** యూరియాపై అవసర రాద్ధాంతం చేయొద్దని, రైతులు విపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందొద్దని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో యూరియా కొరత లేదని, విపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. యూరియా కొరత ఒక్క తెలంగాణలోనే లేదని కేంద్ర ప్రభుత్వ అసమర్థత వల్ల దాదాపు 18 రాష్ట్రాల్లో రైతులు యూరియా కోసం కష్టాలు పడాల్సి వస్తోందని ఆయన అన్నారు. తాజాగా తెలంగాణకు 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఎనిమిది రోజుల్లో మరో 27వేల మెట్రిక్ టన్నులు వస్తుందన్నారు. దీంతో రైతులు యూరియా కోసం తిప్పలు పడే అవస్థ ఉండదన్నారు. కలెక్టరేట్ భవనం కూలిన ఘటనను బీఆర్ఎస్ రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి అభివృద్ధిని పూర్తిగా నాశనం చేసిందే ఆ పార్టీ అన్నారు. కమీషన్ల కోసం బిల్లులు ఆపడం వల్లే నూతన కలెక్టరేట్ పూర్తి కాలేదనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గుత్తేదారుకు 12 కోట్ల బిల్లుల చెల్లింపు పూర్తయిందన్నారు. భవనం కూలిన ఘటనపై మంత్రి జూపల్లి సమీక్షలో ఆరా తీసి..నూతన భవనం గురించి వాకబు చేశారని, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుందని హితవు పలికారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రజా పాలన సాగిస్తున్న ప్రభుత్వం పై బీఆర్ ఎస్ బీజేపీ కావాలనే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్లను బీజేపీ తమవిగా చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. కేవలం స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం పై అనవసర విమర్శలు చేస్తున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు మాజీ మున్సిపల్ చైర్మన్ బాదం గంగన్న, మునిగెల నర్సింగ్, లోక ప్రవీణ్ రెడ్డి,ఎండి రఫీక్, ఎమ్ ఏ షకీల్, అశోక్, రామ్ రెడ్డి, దేరా కృష్ణారెడ్డి ,దొగ్గలి రాజేశ్వర్, ఖిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిజం స్కూల్ బ్రోచర్స్ ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీఅఖిల్ మహాజన్
### యాజమాన్యానికి సిబ్బందికి శుభాకాంక్షలు

**ఆదిలాబాద్ మహా :** ఏఎన్ ఎన్ స్కూల్ ఆఫ్ జర్నలిజం ఆన్ లైన్ శిక్షణా తరగతుల బ్రోచర్స్ ను శనివారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆవిష్కరించారు. పట్టణంలోని పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించి ప్రదర్శించారు. ఏఎన్ ఎన్ యాజమాన్యానికి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళ విద్యార్థినీలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **మహిళలకు అండగా జిల్లా షీ టీమ్స్**
- **మంచిర్యాల డీసీపీ ఎగ్గేడి భాస్కర్**



**మంచిర్యాల, మహా :** మహిళ విద్యార్థినీలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల డిసిపి ఎగ్గేడి భాస్కర్ హెచ్చరించారు. శనివారం షీ టీం మహిళా పోలీస్ స్టేషన్ భరోసా సెంటర్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల షీ టీం కు మొత్తం 114 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వాటిలో 18 క్రిమినల్ కేసులు, ఏడు పెట్టి కేసులు, 89 కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరికలు జారీ చేసి వదిలి వేసినట్లు స్పష్టం చేశారు. మంచిర్యాల జోన్ పరిదిలో ఈ సంవత్సరం ఆగస్టు మాసం వరకు 81 మంది పోకిరీలను షీ టీమ్స్ పట్టుకున్నట్లు తెలిపారు. బాధిత మహిళలకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటు భరోసా కల్పించాలని సూచించారు. జిల్లాలో షీ టీమ్స్, ఇదివరకు గుర్తించిన హాట్ స్పాట్స్ ను ప్రతీరోజు సందర్శించాలని చెప్పారు. ఈవ్ టీజర్ లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకునేలా ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచనలు చేశారు. స్కూళ్లు, కళాశాలలు, జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అంతేకాకుండా మహిళా యువతలు ఉండే హాస్టల్స్, ఉమెన్ వర్కింగ్ హాస్టల్స్ లను సందర్శించి అక్కడ తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళ హాస్టల్లో సెక్యూరిటీ గార్డ్, ఒక మహిళ ఇన్చార్జి తప్పనిసరిగా ఉండేలా చూడాలి వివరించారు. భరోస కేంద్రాలలో బాధిత మహిళ, బాలికకు వైద్యం, కౌన్సిలింగ్, అన్ని రకాల సేవలు అందించడంతో పాటు మీకు అండగా పోలీస్ ఉందనె మనోధైర్యాన్ని కల్పించాలని తెలిపారు. భరోసా సెంటర్లో లీగల్ అడ్వైజర్, కౌన్సిలర్, మెడికల్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలికల కు సంబంధించిన కేసు పోలీస్ స్టేషన్లో నమోదు కాబడిన సమయం నుండి బాధితులకు సపోర్టుగా వారి మానసిక పరిస్థితి, వారి విద్యా పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. పిల్లల పోర్న్ వీడియోలు, అత్యాచారం, సామూహిక అత్యాచారం వీడియోలు అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం, డౌన్‌లోడ్ చేయకూడదు. దీనిని ఐటీ యాక్ట్ లోని సెక్షన్ 67బీ కింద నేరంగా పరిగణిస్తారని అన్నారు.



## హైకోర్టు న్యాయమూర్తిని
# మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్


**హన్మకొండ మహా;** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ కె. లక్ష్మణ్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి స్వాగతం పలికారు. హనుమకొండలోని ఉమ్మడి వరంగల్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ హైదరాబాద్ నుండి హనుమకొండ లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్దకు చేరుకోగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ తో జిల్లా కలెక్టర్ తో పాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పట్టాభి రామారావు, జస్టిస్ నిర్మలా గీతాంబ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# హోండా మోటార్ సైకిల్ ప్రకటన
# ఆ బైకులకు రీకాల్..

హోండా మోటార్‌సైకిల్ & స్కూటర్ ఇండియా 2019 & 2025 మధ్య తయారైన ఆఫ్రికా ట్విన్ మోటార్‌సైకిళ్లకు రీకాల్ ప్రకటించింది. ఎడమవైపు ఉన్న హ్యాండిల్‌బార్ స్విచ్‌లోని వైరింగ్‌లో సమస్యను పరిష్కరించడానికి కంపెనీ స్వచ్ఛందంగా ఈ ప్రకటన చేసింది. ఈ సమస్య హ్యాండిల్ బార్ లోపల ఉన్న హార్నెస్ వైర్ నుంచి వస్తుంది. ఇది సాధారణ స్టీరింగ్ కదలికల కారణంగా పదే పదే వంగి ఉంటుంది. కాలక్రమేణా.. ఇది వైర్ జాయింట్ల వద్ద ఎలక్ట్రిక్ సమస్యలకు దారితీస్తుంది. తద్వారా హారన్ పనిచేయకపోవచ్చని కంపెనీ గుర్తించింది. అంతే కాకుండా.. హెడ్‌లైట్‌ను లో బీమ్ నుంచి హై బీమ్‌కు మార్చడంలో కూడా ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. 2026 జనవరి చివరి వారం నుంచి.. భారతదేశంలోని అన్ని హోండా బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌లు మీ బైక్ ఇప్పటికీ వారంటీలో ఉందా లేదా అనే దానితో సంబంధం లేకుండా సమస్యను పరిష్కరిస్తాయి. కస్టమర్లకు కంపెనీ కాల్స్ లేదా ఈమెయిల్స్ ద్వారా సమాచారం అందిస్తుంది. కాగా ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి కస్టమర్లే డీలర్‌షిప్‌ను సందర్శించవచ్చు. భారతదేశంలో ఆఫ్రికా ట్విన్ కోసం హోండా రీకాల్ ప్రకటించడం ఇదే మొదటిసారి కాదు. నవంబర్ 2024 ప్రారంభంలో, ఫిబ్రవరి, అక్టోబర్ 2022 లలో కూడా ఈ బైకులకు కంపెనీ రీకాల్ ప్రకటించింది. ఇప్పుడు మరోసారి రీకాల్ జారీచేయడానికి సిద్ధమైంది. ఆఫ్రికా ట్విన్ 1,048 సీసీ ప్యారలల్ ట్విన్ ఇంజిన్‌ను కలిగి.. 100.5 bhp పవర్, 112 Nm టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఇది 6స్పీడ్ మాన్యువల్ లేదా హోండా DCT ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఎంపికతో లభిస్తుంది.

# నౌకల రాకపోకలపై పూర్తి నిషేధం విధించిన అదానీ పోర్ట్స్



భారతదేశం ముడి చమురు దిగుమతిని ప్రభావితం చేసేలా అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (APSEZ) చర్యలు చేపట్టింది. దేశంలో అతిపెద్ద ప్రైవేట్ పోర్ట్ ఆపరేటర్‌గా ఉన్న ఏపీసెజ్ యూఎస్, యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్ ద్వారా ఆంక్షల్లో ఉండి రాకపోకలు సాగిస్తున్న నౌకలపై పూర్తి నిషేధాన్ని ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. దేశంలో అదానీ ఆపరేట్ చేస్తున్న అన్ని ఓడరేవుల్లో ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొంది. భారతదేశ ఇంధన పోర్ట్‌ఫోలియోలో కీలకంగా ఉన్న రష్యన్ ముడి చమురు ప్రవాహంపై ఈ చర్యలు ప్రభావితం చేస్తాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అదానీ కొత్త ఆదేశాల ప్రకారం.. పాశ్చాత్య ప్రభుత్వాల ఆంక్షలకు గురైన నౌకలకు ఏపీసెజ్ టెర్మినల్స్ ప్రవేశం, బెర్తింగ్, పోర్ట్ సర్వీసులను పూర్తిగా నిషేధించింది. అందుకు అనుగుణంగా షిప్పింగ్ ఆపరేటర్లు నామినేట్ చేసిన నౌక ఆంక్షల పరిధిలో లేదని నిర్ధారిస్తూ రాతపూర్వక హామీ సమర్పించాల్సి ఉంటుంది. అంతర్జాతీయ పరిశీలన పెరగడం, షాడో ఫ్లీట్ (నిబంధనలకు విరుద్ధంగా విదేశీ చమురు సరఫరా) అధికమవుతుండడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది. ప్రపంచ మార్కెట్లలో చమురు సరఫరాలు, వస్తువుల ఎగుమతులు, దిగుమతులపై స్క్రూటినీ పెరుగుతున్న నేపథ్యంలో అదానీ గ్రూప్ ఈమేరకు చర్యలు చేపట్టినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఈ చర్యల వల్ల రష్యా చమురుపై సరఫరా పరంగా ఒత్తిడి పెరుగుతుందనే వాదనలున్నాయి.

- ఏపీసెజ్ ఫ్లాగ్‌షిప్ టెర్మినల్స్‌లో ఒకటైన ముంద్రా పోర్ట్ భారతదేశం మొత్తం ముడి చమురు దిగుమతుల్లో దాదాపు 10% నిర్వహిస్తుంది. రష్యన్ చమురు సరఫరాకు కీలక కేంద్రంగా ఉంది.
- హెచ్‌పీసీఎల్‌మిట్టల్ ఎనర్జీ లిమిటెడ్ (హెచ్ఈఎంఎల్) తన ముడి చమురు దిగుమతుల్లో 100 శాతం ముంద్రా ద్వారానే కొనసాగిస్తోంది.
- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా బహుళ శుద్ధి కార్యకలాపాల కోసం ముంద్రాను విస్తృతంగా ఉపయోగిస్తుంది.
- పోర్ట్ ట్రాఫిక్ డేటా ప్రకారం, ఇటీవలి నెలల్లో ముంద్రాకు 50% రష్యన్ ముడి చమురు బ్యారెళ్లు సరఫరా అవుతున్నాయి.
- కాండ్లా, ముంబై, పారాదీప్ వంటి ప్రభుత్వ ఓడరేవులకు సరఫరా పెరిగే అవకాశం ఉన్నట్లు కొందరు చెబుతున్నారు.




# చరిత్రలో అతిపెద్ద మార్పు
### రాబర్ట్ కియోసాకి హెచ్చరిక

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాబోయే రోజుల్లో ప్రమాదంగా మారుతుందని ఇప్పటికే చాలామంది నిపుణులు పేర్కొన్నారు. రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసాకి' కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆధునిక చరిత్రలో అతిపెద్ద మార్పు.. అని రాబర్ట్ కియోసాకి ఒక ట్వీట్ చేశారు. ఇందులో ఏఐ వల్ల చాలా మంది తెలివైన విద్యార్థులు ఉద్యోగాలు కోల్పోతారు. నిరుద్యోగం పెరుగుతుంది. చాలా మందికి ఇప్పటికీ ఎడ్యుకేషన్ లోన్స్ అలాగే ఉన్నాయి. నాకు ఉద్యోగం లేదు, కాబట్టి.. ఏఐ నన్ను ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం లేదని అన్నారు. ''కొన్నేళ్ల క్రితం.. పేద తండ్రి పాఠశాలకు వెళ్లు, మంచి గ్రేడ్‌లు పొందు, ఉద్యోగం సంపాదించు, పన్నులు కట్టు, అప్పుల నుంచి బయటపడు, డబ్బు ఆదా చేయు, మరియు స్టాక్‌లు, బాండ్‌లు, మ్యూచువల్ ఫండ్‌ల వంటి విభిన్నమైన పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడి పెట్టు అని చెప్పే మాటలకు బదులుగా.. ధనవంతుడైన తండ్రి సలహాను అనుసరించాను. నేను ఒక వ్యవస్థాపకుడిని అయ్యాను, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టాను, అప్పును ఉపయోగించాను. డబ్బును ఆదా చేయడానికి బదులుగా, నేను నిజమైన బంగారం, వెండి, నేడు బిట్‌కాయిన్‌లను ఆదా చేస్తున్నాను'' అని రాబర్ట్ కియోసాకి చెబుతూనే.. పెట్టుబడి విషయంలో జాగ్రత్త వహించండి అని హెచ్చరించారు.


# ఫోన్‌పేకు రూ.21 లక్షల జరిమానా: కారణం ఇదే..

నియమాలను ఉల్లంఘించిన బ్యాంకులపై కఠిన చర్యలు తీసుకుంటున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI).. ఇప్పుడు ఫిన్‌టెక్ కంపెనీ ఫోన్‌పేకు భారీ జరిమానా విధించింది. 'ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్' (PPIs) కు సంబంధించిన కొన్ని నిబంధనలను పాటించనందుకు ఫోన్‌పే లిమిటెడ్‌కు 21 లక్షల రూపాయల జరిమానా విధించినట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అక్టోబర్ 2023 నుంచి డిసెంబర్ 2024 వరకు కంపెనీ కార్యకలాపాలకు సంబంధించి సెంట్రల్ బ్యాంక్ చట్టబద్ధమైన తనిఖీ నిర్వహించినట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలను పాటించకపోవడం మాత్రమే కాకుండా.. ఈ విషయంలో సంబంధిత ఉత్తర ప్రత్యుత్తరాలను పాటించలేదని ఆర్‌బీఐ వెల్లడించింది. ఈ కారణంగానే ఫోన్‌పేకు నోటీస్ జారీ చేయడం జరిగిందని స్పష్టం చేసింది. జరిమానా విధించినప్పటికీ.. ఇది యూజర్లపై ఎటువంటి ప్రభావం చూడదని పేర్కొంది. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం.. ఫోన్‌పే వంటి అన్ని నాన్ బ్యాంకింగ్స్, ఎస్క్రో బ్యాలెన్స్‌లలో ఏదైనా లోటు ఉంటే వెంటనే రిజర్వ్ బ్యాంక్ పేమెంట్స్ & సెటిల్‌మెంట్ సిస్టమ్స్ విభాగానికి (DPSS) నివేదించాలి. ఎస్క్రో ఖాతా నిల్వలు.. రోజు చివరిలో వ్యాపారులకు చెల్లించాల్సిన బకాయి ఉన్న PPIల విలువ, చెల్లింపుల కంటే తక్కువగా ఉండకూడదని నిబంధనలు పేర్కొంటున్నాయి. పీపీఐ మార్గదర్శకాలను పాటించనందుకు.. రిజర్వ్ బ్యాంక్ ఫోన్‌పేకు 2019లో రూ. కోటి, 2020లో నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ. 1.39 కోట్ల జరిమానా విధించింది. ఇప్పుడు మరోసారి రూ. 21 లక్షల జరిమానా విధించింది.







## దేశం-విదేశం
## NATIONAL-INTERNATIONAL



# ఆ యాప్ లేకుంటే నేపాల్ ఇంకా అగ్నిగుండంగానే రగులుతూ ఉండేదే!!




కేపీ శర్మ ఓలీ నేతృత్వంలోని నేపాల్ ప్రభుత్వం(గత) 26 సోషల్ మీడియా యాప్‌లపై విధించిన నిషేధం.. ఆ దేశంలో అలజడిని సృష్టించింది. జెడ్ జనరేషన్ యువత వీధుల్లోకి చేరి నిరసనలు చేపట్టడం.. వాటిని అదుపు చేసే క్రమంలో హింస చెలరేగి 51 మంది మరణించడం.. యాప్ బ్యాన్ ఎత్తివేత.. అయినా శాంతించని యువత.. ప్రధాని రాజీనామా.. ఆపై ఆందోళనకారుల ఛాయిస్ ప్రకారం తాత్కాలిక ప్రధాని ఎంపిక.. ఇదంతా పదిరోజుల వ్యవధిలోనే చకచకా జరిగిపోయింది. అయితే సో.మీ. బ్యాన్ నేపథ్యంలో ఆందోళనకారులు డిస్‌కార్డ్ Discord అనే చాట్ ప్లాట్‌ఫారమ్‌ను భలేగా ఉపయోగించారు. ఒకవేళ ఈ యాప్ గనుక లేకుండా ఉంటే.. నేపాల్ ఇంకా అగ్నిగుండంగా రగిలిపోతూ ఉండేదేమో అనే చర్చా నడుస్తోందక్కడ. పాలన పేరిట ఇన్నేళ్లుగా కొనసాగిన అవినీతికి నేపాల్ యువత ఎలాగైనా చెక్ పెట్టాలనుకుంది. ఆందోళనలను ఉధృతంగా జరిపి ప్రభుత్వం మెడలు వచ్చింది. అయితే ఈ ఆందోళనలను సమన్వయపర్చుకోవడానికి డిస్‌కార్డ్ యాప్‌నే Gen Z నిరసనకారులు ఉపయోగించుకున్నారు. అంతేకాదు.. కేపీ శర్మ ఓలీ రాజీనామా తర్వాత.. తమ ఆకాంక్షలకు అనుగుణంగా నాయకుడ్ని ఎన్నుకునే క్రమంలోనూ ఈ వేదికనే ఉపయోగించుకున్నారు. Discord అనే యాప్ గురించి మిలెనియల్స్‌కు పెద్దగా పరిచయం లేకపోయినా.. Gen Z యువత మాత్రం సౌకర్యవంతమైన, విశ్వసనీయమైన వేదికగా భావిస్తోంది. డిస్‌కార్డ్(Discord) అనేది 2015లో ప్రారంభమైన డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్. ఇది గేమర్ల కోసం ఆటల మధ్యలోనే స్నేహితులతో చాట్ చేయడానికి రూపొందించబడిన ఒక యాప్. అయితే.. 2020లో మహమ్మారి సమయంలో Gen Z యువతలో ఇది విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. Discord ద్వారా వినియోగదారులు సర్వర్లు అనే కమ్యూనిటీలు ఏర్పాటు చేసి.. టెక్స్ట్, ఆడియో, వీడియో చానెల్స్ ద్వారా చర్చలు జరపడం ప్రారంభించారు. స్క్రీన్ షేరింగ్, స్ట్రీమింగ్, మోడరేషన్ టూల్స్ వంటి ఫీచర్లు కూడా వీటిలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో సర్వర్‌లో గరిష్టంగా 5 లక్షల మంది చేరవచ్చు, కానీ ఒకేసారి 2.5 లక్షల మంది మాత్రమే యాక్టివ్‌గా ఉండగలరు. అందుకే నేపాల్ యువత ఉద్యమానికి దీన్నొక వేదికగా మల్చుకుంది.

### వీపీఎన్ సాయంతో..

సాధారణంగా వీపీఎన్‌లను ఎందుకు ఉపయోగిస్తారు?.. మిగతా వాళ్ల సంగతి ఏమోగానీ.. నేపాల్ యువత మాత్రం ఈమధ్య దీనిని తాజాగా నిరసనలకే ఉపయోగించింది(నేపాల్‌లో VPNల వినియోగం 3 రోజుల్లోనే 6,000% పెరిగింది.. అలాగే 5వ రోజు కొచ్చేసరికి 8,000% పెరిగింది.). నేపాల్‌లో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై నిషేధం కొనసాగుతున్న వేళ.. విస్తృత యాప్‌గా పేరున్న డిస్‌కార్డ్(Discord) వీపీఎన్ సాయంతో అందుబాటులోకి తెచ్చుకుంది. ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్‌లలో ఉన్నట్లు ఎండ్‌లెస్ ఫీడ్‌లు లేకుండా.. వాట్సాప్ కంటే ఎక్కువ ఫీచర్లతో Discord ఉండడం వల్లే దీనిని రైట్‌ఛాయిస్‌గా అక్కడి యువత భావించింది. అలా.. "Youth Against Corruption" అనే Discord సర్వర్‌లో 145,000 మందికి పైగా సభ్యులుగా చేరారు. ఈ సర్వర్‌లో చర్చలు, అనౌన్స్‌మెంట్స్, ఫ్యాక్ట్ చెక్, హెల్ప్‌లైన్‌లు వంటివి కొనసాగించింది. వారు ఏర్పాటు చేసిన Discord సర్వర్లలో ఇన్‌ఫర్మేషన్ సులభంగా పాసయ్యింది. పెద్ద సంఖ్యలో సభ్యులు చర్చలు జరిపేందుకు ఇదొ కీలక వేదికగా నిలిచింది. ఇది ఇక్కడితోనే ఆగిపోలేదు.

### ఓటింగ్ కూడా..

నేపాల్ తాత్కాలిక నాయకత్వం విషయంలో ఏర్పడిన గందరగోళాన్ని డిస్‌కార్డే తొలగించింది!. మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కార్కి, నేపాల్ పవర్ హౌజ్‌గా పేరున్న కుల్మన్ ఘీసింగ్, రాపర్ బాలేంద్ర షా(బాలెన్), ఇలా పలువురి పేర్లతో ఓ డైలామా ఏర్పడగా.. డిస్‌కార్డ్ జరిగింది ఓటింగ్ ద్వారా స్పష్టత తెచ్చుకుంది. అంతేకాదు.. ఈ యాప్ ద్వారానే ప్రతిపక్షాన్ని కూడా సమన్వయపర్చుకుని.. రాజకీయ అనిశ్చితిని తొలగించింది. ఈ ఓటింగ్‌ను పర్యవేక్షించిన శశ్వత్ లామిచ్ఛానే కూడా ఈ విషయాల్ని ధృవీకరించారు. ఇక డిస్‌కార్డ్‌లో ఓటింగ్ బుధవారం పూర్తైంది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ ప్రకారం.. 50 శాతం ఓట్లు సుశీల్ కార్కీకే పడ్డాయి. ఆ మరుసటి రోజు ఆమె నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్, ఆర్మీచీఫ్ అశోక్ రాజ్ సిగ్దెల్‌ను కలిశారు. అలా నేపాల్ తాత్కాలిక ప్రధాని ఎపిసోడ్‌లో ఉత్కంఠ వీడింది. అయితే.. ఇండియా టుడే ఓఎస్ఐఎన్‌టీ(OpenSource Intelligence) సర్వే ప్రకారం ఈ ఓటింగ్‌లో పాల్గొన్నవాళ్లంతా నేపాల్ పౌరులేనా? అనే అనుమానాలు వ్యక్తం చేసింది.

### భారత్‌లోనూ డిస్‌కార్డ్

Discord ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉంది. అమెరికాలో దాదాపు 25 కోట్లు, బ్రెజిల్‌లో ఐదున్నర కోట్ల యూజర్లు ఉన్నారు. ఆ తర్వాత భారత్‌లోనూ ఐదు కోట్ల మంది ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ లిస్ట్‌లో కెనడా, ఫిలిప్పీన్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ప్లాట్‌ఫారమ్ విండోస్, మాక్‌ఓఎస్, ఆండ్రాయిడ్, ఐవోఎస్, లైనక్స్ వెబ్ బ్రౌజర్లలో కూడా అందుబాటులో ఉంది. ప్రస్తుతానికి 30కి పైగా భాషల్లో అందుబాటులో ఉంది, అందులో తెలుగు మాత్రం లేదు. డిస్‌కార్డులో గేమింగ్ మాత్రమే కాదు.. పౌర ఉద్యమాలు, రాజకీయ చర్చలు నడుస్తున్నాయి. సొంత సర్వర్‌తో క్రియేటివ్ కమ్యూనిటీలు నిర్మించుకునేందుకు వీలుగా ఉండడంతోనే ఇది సాధ్యమవుతోంది. అంత నిషేధంలోనూ Gen Z యువతకు డిస్‌కార్డ్ యాప్ ఒక గళం ఇచ్చింది. ఒకవేళ ఈ యాప్‌ను జెన్ జెడ్ యువత గనుక సమర్థవంతంగా ఉపయోగించుకుని గనుక ఉండి ఉంటే.. నేపాల్ ఉద్యమం అసంఘటితంగా, అస్పష్టంగా, మరింత హింసాత్మకంగా మారిపోయే అవకాశం ఉండేదేమో!.

# యూకేలో మహిళపై అత్యాచారం..
## మీ దేశానికి వెళ్లిపో అంటూ హెచ్చరికలు!



లండన్: అమెరికాలోని డల్లాస్ నగరంలో ఎన్నారైను హత్య చేసిన ఘటన మరువకముందే.. యూకేలో మరో దారుణం చోటు చేసుకుంది. బ్రిటన్‌కు చెందిన సిక్కు మహిళపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. యూకేలోని ఓల్డ్‌బరీ టౌన్‌లో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 20 ఏళ్ల బ్రిటన్ సిక్కు మహిళపై అత్యాచారానికి పాల్పడటమే కాకుండా ' ఇక మీ దేశానికి వెళ్లిపో' అంటూ హెచ్చరించడం తీవ్రంగా కలకలం రేపుతోంది. దీనిపై ఫిర్యాదు చేసిన సదరు బ్రిటన్ మహిళ.. వారు జాత్యహంకారవాదులుగా పేర్కొన్నారు. ఈ దారుణానికి పాల్పడింది కచ్చితంగా జాత్యహంకార వాదులేనని తీర్మానించుకున్న పోలీసులు.. దీనికి ప్రజల నుంచి సహకారం కావాలన్నారు. ప్రస్తుతం సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్న పోలీసులు.. ఫోరెన్సిక్ ఆధారాలు సంపాదించే పనిలో ఉన్నారు. దీనిపై దర్యాప్తు జరుగుతున్నట్లు యూకే పోలీస్ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ ఘటన పాల్పడిన ఇద్దరు అనుమానితులను తెల్లవారిగా పోలీసులు గర్తించారు. అందులో ఒకరు క్లీన్‌షేవింగ్ హెడ్‌తో డార్క్ కలర్ టీషర్ట్ ధరించగా, మరొకరు గ్రే కలర్ టాప్‌ను ధరించినట్లు పోలీసుల ప్రాథమిక ఆధారాల ద్వారా తెలిసింది. ప్రధానంగా సిక్కు కమ్యూనిటీని టార్గెట్ చేసే ఈ దాడులు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. గత నెలలో కొంతమంది సిక్కు యువకుల్ని వేధింపులకు గురిచేసిన ఘటన సైతం ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇప్పుడు ఓ సిక్కు మహిళపై అత్యాచారానికి పాల్పడటం అక్కడ ఉండే సిక్కు మతస్తుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. దీనిపై పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత పెంచుతామని యూకే పోలీసులు స్థానికులకు భరోసా ఇచ్చారు. ఈ ఘటనను బ్రిటీష్ ఎంపీ ప్రీత్ కౌర్ గిల్ తీవ్రంగా ఖండించారు. ఇటీవల కాలంలో బహిరంగంగానే జాత్యహంకార జాడ్యం విస్తృతమైనట్లు పేర్కొన్నారు. ఇది కచ్చితంగా తీవ్రంగా పరిగణించాల్సిన అంశంగా స్పష్టం చేశారు. అత్యాచారానికి పాల్పడటంతో పాటు ఆమె ఇక్కడికి చెందినది కాదంటూ జాత్యహంకార వాదులు చేసిన వ్యాఖ్యలను బర్మింగ్‌హామ్ ఎడ్జ్‌బాస్టన్‌కు చెందిన మరో ఎంపీ తప్పుబట్టారు. ఇది తీవ్రమైన హింసాత్మక చర్య అని, ఆమె ఇక్కడిది కాదు.. మీ దేశానికి వెళ్లిపో అంటూ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. 'మన సిక్కు సమాజానికే కాదు.. ప్రతి సమాజానికి సురక్షితంగా, గౌరవంగా జీవించే హక్కు ఉంది. ఓల్డ్‌బరీలోనైనా బ్రిటన్‌లో ఎక్కడా కూడా జాత్యహంకారానికి, స్త్రీ ద్వేషానికి స్థానం లేదు' అని పేర్కొన్నారు.

# రష్యా చమురు కొంటే సుంకాలు..జీ 7పై అమెరికా ఒత్తిడి




న్యూఢిల్లీ: రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాలపై సుంకాలను తప్పనిసరిగా విధించాలని యునైటెడ్ స్టేట్స్ తాజాగా గ్రూప్ ఆఫ్ సెవెన్ (జీ7) భాగస్వాములను కోరింది. భారత్, చైనాలు ఉక్రెయిన్‌లో.. మాస్కో యుద్ధ ప్రయత్నాలకు కీలక సహాయకులుగా అమెరికా ఆరోపించింది. శుక్రవారం జీ7 ఆర్థిక మంత్రులతో జరిగిన ఫోను సంభాషణలో యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్, వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్‌లు వాషింగ్టన్ సుంకాల నిర్ణయాలకు అనుగుణంగా మెలగాలని మిత్రదేశాలను ఒత్తిడి చేశారు. రష్యా ఇంధన ఆదాయాలను తగ్గించడమనే ఏకీకృత విధానం ద్వారా మాత్రమే యుద్ధానికి ముగింపు పలకగలమని వారు పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ యుద్ధ యంత్రాంగానికి నిధులు సమకూర్చే ఆదాయాలను మూలం నుంచే తగ్గించే ఏకీకృత ప్రయత్నంలో భాగంగానే మేము ఆయా దేశాలపై ఆర్థిక ఒత్తిడిని తెస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బెసెంట్, గ్రీర్ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కెనడా ఆర్థిక మంత్రి ఫ్రాంకోయిస్‌ఫిలిప్ షాంపైన్ అధ్యక్షతన జరిగిన ఈ వర్చువల్ చర్చలు.. ఉక్రెయిన్ రక్షణకు మద్దతుగా నిలుస్తూ, రష్యన్ ఆస్తులను దెబ్బతీసే అవకాశంపై దృష్టి సారించాయి. జీ 7లోని భాగస్వామ్యమైన ఉక్రెయిన్ దీర్ఘకాలిక ఆర్థిక పునరుద్ధరణను కాపాడుతూ, మాస్కోపై ఒత్తిడిని కఠినతరం చేయడంలో సభ్య దేశాలు ఐక్యంగా ఉండాలని వారు స్పష్టం చేశారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే భారత దిగుమతులపై సుంకాలను అదనంగా 25 శాతం మేరకు పెంచారు. మాస్కోతో న్యూఢిల్లీ చమురు వాణిజ్యాన్ని అణిచివేసే ప్రయత్నంలో భాగంగా శిక్షాత్మక సుంకాలను 50 శాతానికి తీసుకువచ్చారు.



# సాయిపల్లవి చేతిలో మరో క్రేజీ ప్రాజెక్ట్


కోలీవుడ్‌లో నటుడు శింబుది ప్రత్యేక స్థానం. విమర్శలు, వివాదాల్లో చిక్కుకున్నా, అపజయాలను ఎదుర్కొన్నా, ఆయన క్రేజే వేరు. 50 చిత్రాలకు చేరుకున్న ఈయన తాజాగా కొన్ని క్రేజీ చిత్రాలను చేస్తున్నారు. అందులో ఒకటి వెట్రిమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం. ఇది ఉత్తర చెన్నై నేపథ్యంలో తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ కథా చిత్రం అని చిత్ర వర్గాల సమాచారం. వెట్రిమారన్‌కు దర్శకుడిగా ఒక ప్రత్యేక బాణి ఉంది. ఆయన కథలన్నీ సమాజంలోంచి, ముఖ్యంగా అట్టడుగు జనాల జీవితాలను ఆవిష్కరించేవిగా ఉంటాయి. కాగా ఇంతకుముందు ధనుష్ హీరోగా ఉత్తర చెన్నై నేపథ్యంలో వడచెన్నై అనే చిత్రాన్ని తెరకెక్కించి మంచి విజయాన్ని అందుకున్నారు. కాగా తాజాగా మరోసారి అదే నేపథ్యంలో మరో కోణంలో శింబు హీరోగా చిత్రం చేస్తున్నారు. ఇది శింబు కథానాయకుడుగా నటిస్తున్న 49వ చిత్రం అవుతుంది. ఇందులో ఈయనకు జంటగా పూజాహెగ్డే నటించనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే తాజాగా ఆ పాత్రలో సాయిపల్లవి నటించనున్నట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈమె ప్రస్తుతం హిందీలో ఏక్ దిన్ చిత్రాన్ని పూర్తి చేసి, రామాయణ 1, 2 చిత్రాలను చేస్తున్నారు. ఇందులో సాయిపల్లవి సీతగా నటిస్తున్నారు. చాలా గ్యాప్ తరువాత ఈమె మళ్లీ తమిళంలో నటించనున్నారన్నమాట. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందన్నది గమనార్హం.

# త్వరలోనే ఆ అదృష్టవంతుడిని చూస్తారు

దాదాపు 20 ఏళ్లుగా సినిమాలు చేస్తున్న తమన్నా.. ఇప్పటికీ అదే ఊపు, జోష్ చూపిస్తూ కుర్ర హీరోయిన్లకు పోటీ ఇస్తోంది. కొత్త చిత్రాలు, వెబ్ సిరీసులు అంతే ఉత్సాహంతో ప్రమోషన్లలో పాల్గొంటూ ఆకట్టుకుంటోంది. నటన పరంగా ఈమె దూసుకుపోతున్నప్పటికీ.. ప్రేమ పరంగా ఈమె జీవితంలో ఓ బ్రేకప్ ఉంది. హిందీ నటుడు విజయ్ వర్మతో కొన్నాళ్ల పాటు డేటింగ్ చేసిన ఈమె.. కొన్నాళ్ల క్రితం బ్రేకప్ చెప్పేసుకుంది. ప్రస్తుతానికైతే సింగిల్‌గానే ఉంటోంది. అయితే త్వరలోనే తనకు కాబోయే అదృష్టవంతుడిని చూస్తారని తమన్నా ఇప్పుడు చెప్పడం ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే విజయ్ వర్మతో బ్రేకప్ అయి ఎన్నాళ్లు కాలేదు ఇప్పుడు తమన్నా ఈ తరహా కామెంట్స్ చేయడం కొత్త సందేహాలు రేకెత్తిస్తోంది. ఈమె నటించిన లేటెస్ట్ వెబ్ సిరీస్ 'డూ యూ వాన్నా పార్ట్‌నర్' ఈరోజు(సెప్టెంబరు 12) నుంచే స్ట్రీమింగ్ కానుంది. దీని ప్రమోషన్లలోనే మాట్లాడుతూ తన కాబోయే భాగస్వామి గురించి చెప్పుకొచ్చింది.

'మంచి జీవిత భాగస్వామిగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాను. ప్రస్తుతం నా ఆలోచన అదే. గత జన్మలో ఎంత పుణ్యం చేసుంటే నాకు తమన్నా లాంటి భార్య దొరికిందని నా భర్త ఆనందపడాలి. దానికోసమే నా ప్రయత్నం. అయితే ఆ లక్కీ పర్సన్ ఎవరనేది నాకు తెలియదు. త్వరలోనే మీరు అతడిని చూస్తారేమో?' అని తమన్నా చెప్పింది. ఈమె మాట్లాడిన దానిబట్టి చూస్తుంటే మళ్లీ ప్రేమలో పడిందా అనే డౌట్ వస్తోంది. ఒకవేళ రిలేషన్‌లో ఉంటే అతడెవరా అనేది తెలియాల్సి ఉంది. 2005 నుంచి తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నటిస్తున్న తమన్నా ఇప్పటివరకు దాదాపు 90 సినిమాలు చేసింది. అలానే పలు వెబ్ సిరీసులు కూడా చేసింది. వయసు పెరుగుతున్నా సరే అదే అందాన్ని మెంటైన్ చేస్తూ అప్పడప్పుడు ఐటమ్ సాంగ్స్ కూడా చేస్తూ యూత్‌ని అలరిస్తోంది. మరి పెళ్లెప్పుడు చేసుకుంటుందో చూడాలి?





# దిశా పటానీకి వార్నింగ్..

## ఇంటి ముందు కాల్పులు

బాలీవుడ్ హీరోయిన్ దిశా పటానీ ఇంటి ముందు కాల్పులు జరిగాయి. ఉత్తరప్రదేశ్ బరేలీలోని తన నివాసం వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే, ఈ కాల్పుల వల్ల ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.దిశా పటానీ సోదరి ఖుష్బూ పటానీ కొద్దిరోజుల క్రితం చేసిన వ్యాఖ్యలు ఒక వర్గం మనోభావాలను దెబ్బతీసినట్లు తెలుస్తోంది. ఈ కారణం వల్లే ఈ దాడి జరిగిందని స్థానికులు భావిస్తున్నారు . అయితే, ఈ కాల్పులు తామే జరిపామని గోల్డీ బ్రార్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ మేరకు బాలీవుడ్ మీడియాలో వార్తలు కూడా వచ్చాయి. కానీ, ఈ విషయాన్ని పోలీసులు ఇంకా ధృవీకరించలేదు. మాజీ ఆర్మీ అధికారిణి అయిన ఖుష్బూ ప్రస్తుతం ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com